
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నల్లగొండ

5

శుక్రవారం 31 అక్టోబరు 2025



గరిష్ఠం 29.0
కనిష్ఠం 21.0

****

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	590 (312.0450)	1,46,733	1,46,733 14 గేట్ల ఎత్తివేత
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643. (4.11)	45,042.61	47,827.66
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	171.618 (40.6787)	84,370	98,285 4 గేట్ల ఎత్తివేత

చికెన్ ధరలు | లైవ్ : రూ.149 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260



అభ్యంతరాలు తొలగేలా ఆత్మీయత పెరిగేలా

వివాహ పూర్వ కౌన్సెలింగ్ కేంద్రాలు

- దంపతులు కానున్న యువ జంటల్లో అంతరాలు తొలగించేందుకు త్వరలో ఏర్పాటు

దీర్ఘ సుమంగళీ భవా! అంటూ పెద్దలు దీవించిన పెళ్లిళ్లు.. ఒకరినొకరు ఇష్టపడి, ప్రేమించి చేసుకున్న జంటలు చిన్న చిన్న మనస్పర్థలతో చివరిదాకా కొనసాగడం లేదు. అన్యోన్యంగా సాగాల్సిన వివాహ బంధం పలు కారణాలతో తెగుతోంది. వీటికి చెక్ పెట్టేందుకు వివాహ పూర్వ కౌన్సిలింగ్ కేంద్రాలను త్వరలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఏర్పాటు చేయనున్నారు.

- (ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

పరస్పర అనుమానాలు, లోపిస్తున్న నైతిక విలువలు, అభిప్రాయ భేదాలు, అంతకుమించి కుటుంబసభ్యుల మితిమీరిన జోక్యం, తదితర కారణాలతో భార్యాభర్తల మధ్య సఖ్యత లోపించి న్యాయం కావాలంటూ పోలీస్‌స్టేషన్లను ఆశ్రయిస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఈ దైన్య స్థితి యువ జంటలతోపాటు పిల్లలున్న భార్యాభర్తల మధ్య కూడా ఉంది. దీంతో పోలీస్‌స్టేషన్లు, సఖికేంద్రాలు, సీడీఈడబ్ల్యూలలో కౌన్సిలింగ్ ఉదంతాలు పెరగుతున్నాయి. ఈ వైఖరి అంతిమంగా కుటుంబవ్యవస్థపై ప్రభావం చూపుతోంది. దీనికి దంపతుల మధ్య అవగాహన లోపమే ప్రధాన కారణమని వ్యక్తిత్వ వికాస, మానసిక నిపుణులు, అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో దంపతులు కాబోతున్న యువ జంటలకు వైవాహిక జీవితం, పరిస్థితులు, సమస్యల ను అధిగమించడం, ఎదుర్కోవడం తదితర అంశాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ వివాహ పూర్వ కౌ న్సిలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంకల్పించింది. ఈమేరకు ఇటీవలే ఆ శాఖ మంత్రి సీతక్క ఉత్తర్వులు జారీ చేశారు. విధివిధానాలు ఖరారు కాగానే ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో....

- మిగతా 7వ పేజీలో...



కనగల్ మండలం చెన్నారంలో తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు

మొంథా.. నష్టం కొండంత

- భారీ వర్షాలకు రైతులు అతలాకుతలం
- జిల్లాలో 61,511 ఎకరాలల్లో పంట నష్టం
- ప్రాథమిక అంచనాను రూపొందించిన వ్యవసాయ శాఖ

మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో భారీగానే పంట నష్టం జరిగింది. చేతికొచ్చిన పంట నేలవాలడంతో రైతులు అతలాకుతలమయ్యారు. వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా ప్రకారం 61,511 ఎకరాల్లో పంట మునిగినట్లు చెబుతున్నా, అనధికారికంగా ఆ సంఖ్య ఎక్కువగానే ఉన్నట్లు తెలుస్తోంది. వరి, పత్తి పొలాల్లో చేరిన నీటితో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

జిల్లాలో కురుస్తున్న వర్షాలకు 61,511 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు జిల్లా వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనాను రూపొందించింది.గతంలో కురిసిన వర్షాలకుతోడు మొంథా తుఫాన్ ప్రభావంతో ఈ పంటనష్టం వాటిల్లింది. మొత్తంగా చూస్తే జిల్లాలోని 310గ్రామాల్లో 30,359మంది రైతులకు సంబంధించిన పంటలు దెబ్బతిన్నాయి.ఇందులో 35,487 ఎకరాల్లో వరి,25,911 ఎకరాల్లో పత్తి, 105ఎకరాల్లో మిరప పంట నష్టం జరిగింది.

నియోజకవర్గాల వారీగా..

నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే నాగార్జునసాగర్ నియోజకవర్గంలో 80 గ్రామాల్లో 14,004 ఎకరాల్లో వరి, 2014 ఎకరాల్లో పత్తి, 30 ఎకరాల్లో మిరప పంటలకు నష్టం వాటిల్లింది. దేవరకొండ నియోజకవర్గంలో 92 గ్రామాల్లో 4,665 ఎకరాల్లో వరి, 18,830 ఎకరాల్లో పత్తిపంట, 25 ఎకరాల్లో మిరప దెబ్బతిన్నది. మిర్యాలగూడ నియోజకవర్గపరిధిలో 66 గ్రామాల్లో 10,244 ఎకరాల్లో వరి, 65 ఎకరాల్లో పత్తి, 50 ఎకరాల్లో మిరప పంటకు నష్టం వాటిల్లింది. మునుగోడు నియోజకవర్గంలో 16 గ్రామాల్లో 925 ఎకరాల్లో ...

- మిగతా 8వ పేజీలో...

33శాతం పంట దెబ్బతింటేనే నష్టపరిహారం

ప్రభుత్వ నిబంధనల మేరకు 33శాతానికి పైగా దెబ్బతింటనే నష్ట పరిహారాన్ని అందిస్తారు. ప్రాథమిక అంచనా ప్రకారం 61,511 ఎకరాలు పంట నష్టం వాటిల్లింది. ఈ వారంలో మరోసారి క్షేత్రస్థాయిలో విస్తృతంగా సర్వేచేస్తారు. పంట రికవరీ అయితే నష్ట పరిహారాన్ని అందించే అవకాశాలు తక్కువగా ఉంటాయి. అంటే 33శాతం పంట దెబ్బతిన్నట్లయితే ప్రతీ రైతుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నష్ట పరిహారం అందుతుంది. ఈ వారంలో నీరు భూమిలో ఇంకిపోయి పత్తితో పాటు వరిపంట రికవరీ అయినట్లయితే ఆ నష్టం ఏ మేరకు ఉంది, రైతు ఎంత మేరకు నష్టపోయాడనేది ప్రభుత్వం గుర్తించనుంది. జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారులు వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే వేగవంతంగా పంటనష్టాన్ని ప్రాథమిక అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించారు. దీంతో పంటనష్టపోయిన రైతులకు త్వరగా పరిహారం అందే అవకాశాలు కూడా స్పష్టంగా ఉన్నాయి. ఈ సంవత్సరం వానాకాలంలో జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు తెలుస్తోంది. ప్రకృతి వైపరీత్యాలతో కోలుకోలేని దెబ్బతిన్నారు. పత్తి, వరి పంటలు చేతికి రాకుండా పోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

తడిసి ముద్దయిన ధాన్యం

ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. అకాలవర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. 24 పీఏసీఎస్, 36ఐకేపీ కేంద్రాల్లో 4,600 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసిపోయినట్లు పౌరసరఫరాల సంస్థతోపాటు ఆ శాఖ అధికారులు లెక్కలు తేల్చారు. దాదాపు 180 వరి కుప్పలు తడిసిపోయాయి. చాలాచోట్ల వర్షాలకు ధాన్యం మొలకెత్తింది. ధాన్యం మొలకెత్తడంతో రైతులకు నష్టంవాటిల్లింది. ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో లేకపోవడం, కేంద్రాలు సైతం ఎక్కడపడితే అక్కడ గుంటలలో ఏర్పాటు చేయడంతో ధాన్యం రాశులు నీటిలో మునిగిపోయాయి. కనగల్ మండలం తేలకంటిగూడెం గ్రామంలో ధాన్యం కుప్పలు మొలకెత్తి పోయాయి. వాస్తవానికి ఐకేపీ కేంద్రాల్లో ఏర్పాట్లను సక్రమంగా చేయకపోవడంతోనే ఈ నష్ట వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. రైతులకు పొలాల వద్ద కల్లాలు లేకపోవడంతో పంట కోసిన వెంటనే ధాన్యాన్ని ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాలకు తెచ్చి ఆరబెట్టుకునే ప్రయత్నం చేశారు. అకాల వర్షాలు రైతులను నిండా ముంచాయని చెప్పవచ్చు.



కనగల్ మండలం తేలికంటిగూడెంలో మొలకెత్తిన ధాన్యం

శాంతి, భద్రతల పరిరక్షణకు నిరంతర కృషి

● ఎస్పీ శరత్ చంద్రపవార్




సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ శరత్ చంద్రపవార్, పోలీస్ సిబ్బంది

నల్లగొండ క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శాంతి, భద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని ఎస్పీ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సైకిల్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ప్రతీ సంవత్సరం ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా అమరులైన వారి ఆత్మకు శాంతి కలగాలన్నారు. ర్యాలీ ఎన్జీ కళాశాల నుంచి పట్టణంలోని పలు ప్రాంతాల మీదుగా సాగి గడియారం సెంటర్‌కు చేరుకుంది. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, డీఎస్పీ శివరాంరెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రాఘవులు, రాజశేఖర్ రెడ్డి, మహాలక్ష్మయ్య, శ్రీను నాయక్, ఆర్ఐలు సంతోష్, శ్రీను, సూరప్ప నాయుడు, హరిబాబు, ఎస్ఐలు సైదులు, శంకర్, గోపాలరావు, వీరబాబు, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ఇలా వెళ్లి.. అలా వచ్చారు

- ఉదయం బదిలీ... మధ్యాహ్నం డిప్యూటేషన్
- ఆ సార్‌కు గంటల్లోనే తిరిగి యథాతథ పోస్ట్
- రిజిస్ట్రేషన్ శాఖలో అక్రమ బదిలీల దందా



జిల్లా స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖలో జరిగిన ఈ అక్రమ బదిలీ బాగోతం సర్వత్రా చర్చకు దారితీసింది. ఓ చిన్నసార్‌కు రెగ్యులరైజేషన్ ఇవ్వడమే కాకుండా జిల్లాలోని ఓ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఉదయం బదిలీచేసి మధ్యాహ్నం డిప్యుటేషన్‌పై తీసుకరావడం చర్చనీయాంశమైంది.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

ఉమ్మడి నల్లగొండ జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఓ చిరుద్యోగి ఇష్టారాజ్యంగా వ్యవహరించి వసూళ్లను నిరంతర ప్రక్రియగా మార్చేశారన్న ఆరోపణలున్నాయి. సాధారణంగా జరిగే సెక్షన్ టూ సెక్షన్‌కు వెళ్లే ఫైళ్లకు సైతం రేట్లు నిర్ణయించాడు. ఆ సొమ్ము అంతా తనకు చెల్లించిన తర్వాతే ఫైల్ ఉన్నతాధికారి వద్దకు వెళ్లే విధంగా శాఖలో పట్టు సాధించాడు. సక్రమంగా ఉన్న ఫైళ్లకు ఒక్కో ఫైల్‌కు సంబంధించి కేటగిరీగా డబ్బులు వసూలు చేస్తున్న ఆ ఉద్యోగి కిరికిరి ఉన్న సొసైటీ ఫైళ్లకు రూ.లక్షల్లో వసూలు చేస్తున్నాడు. ఇన్‌చార్జి అధికారులు ఉన్న సమయంతోపాటు పూర్తిస్థాయి అధికారులు సెలవుల్లో వెళ్లిన సమయంలో అక్రమ వసూళ్ల చేయడం పరిపాటిగా మారింది. ఈ తతంగం అంతా రోజురోజుకు మితిమీరి పోతుండటంతో సంబంధిత శాఖలోని సీనియర్ ఉద్యోగులకు పాలుపోవడం లేదు. దీంతో చేసేది ఏమీ లేక వారు కూడా తమకు అప్పగించిన పని చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

డబ్బులు ఇవ్వకపోతే ఇక అంతే సంగతి..

స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖలో డబ్బులు ఇవ్వని ప్రతీ ఫైల్‌ను ఆ చిన్న సార్ వెనక్కి పంపుతున్నాడన్న ఆరోపణలు వస్తున్నాయి. సాధారణంగా ఆస్తుల క్రయ విక్రయాలతోపాటు డాక్యుమెంట్ రైటర్లు, ఇతరులు తమ డాక్యుమెంట్లు, ఫైళ్లను ఆ సెక్షన్‌కు పంపితే ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అన్ని కాగితాలు సక్రమంగా ఉన్నప్పటికీ ఫైల్ రిజెక్ట్ చేయడం, రోజుల కొద్దీ పెండింగ్‌లో పెట్టడం గమనార్హం. సొసైటీల ఫైల్‌తోపాటు ఫర్మ్‌లు, బైలాలు, ఎంతలు, వ్యాలిడేషన్, అమైన్‌మెంట్, స్టాంపు లైసెన్స్‌లు, ఫ్రాంకింగ్‌కు సంబంధించిన ప్రతీ అంశంలోనూ ఆ సార్ చేయిపెడుతుండడం గమనార్హం. ఇతర సెక్షన్ ఉద్యోగులకు ఏ మాత్రం కూడా స్వేచ్ఛ లేకుండా అన్నీ తానై నడుపుతుండటంతో సెక్షన్ల పనితీరు పూర్తిగా గాడి తప్పిపోయింది. సెక్షన్ల సర్దుబాటు చేశామని పేర్కొంటున్నా, సీనియర్లకు ప్రాధాన్యం లేకపోవడం వల్ల అడ్మినిస్ట్రేషన్ ఆగమాగంగా మారింది.

చిట్‌ఫండ్‌ల ఫైల్‌ల విషయంలో..

జిల్లాలోని పలు చిట్‌ఫండ్‌లకు సంబంధించిన సమస్యలు వచ్చినప్పుడు ఆ ఉద్యోగికి కాసుల పంట పండుతుంది. కొన్ని చిట్‌ఫండ్‌లో డీఫాల్టర్లు.. అంటే ఎవరైనా చిట్టి ఎత్తి డబ్బులు కట్టకపోతే వారికి..

- మిగతా 8వ పేజీలో...

ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం

ఫిర్యాదులువస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. సెక్షన్ల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీనియర్లకు ప్రాధాన్యం కల్పిస్తాం. ఫైళ్ల విషయంలో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. సదరు ఉద్యోగి బదిలీ జరిగిన వెంటనే డిప్యుటేషన్‌పై వచ్చిన విషయాన్ని పరిశీలిస్తాం. స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలో పారదర్శకంగా సేవలు అందిస్తాం.

- రవీందర్ రావు, ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్, నల్లగొండ

మెరుగైన వైద్యం అందించాలి



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

చిట్యాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ కోరారు. గురువారం చిట్యాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. మందుల స్టాక్, రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్ రెడ్డి, డీటీసీ కళ్యాణచక్రవర్తి, డీఎంవో ప్రదీప్‌కుమార్, వైద్యాధికారి సత్యనరేష్, సిబ్బంది వెంకటరమణమ్మ, కమలకుమారి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తే చర్యలు

జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు

దేవరకొండ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న సన్నబియ్యాన్ని పక్కదారి పట్టిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి వెంకటేశ్వర్లు గురువారం హెచ్చరించారు. జిల్లాలో అన్ని రేషన్ దుకాణాలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా పంపిణీ కోసం ఉద్దేశించిన బియ్యాన్ని అక్రమంగా మళ్లించకుండా నిరోధించడానికి చర్యలు చేపడుతున్నామన్నారు.

తేమతో నిమిత్తం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

నార్కట్‌పల్లి,అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్‌తో తడిసిన ధాన్యాన్ని తేమతో నిమిత్తం లేకుండా కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి డిమాండ్‌చేశారు. గురువారం నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెం ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తమ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. కేంద్రంలో తడిసిన ధాన్యం కుప్పలను పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చి 20రోజులు గడుస్తున్నా కాంటా వేయకపోవడం కారణంగానే ధాన్యం ఎక్కువగా తడిసిందన్నారు. ప్రభుత్వం తక్షణమే రైతుల ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10,000 పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి చింతపల్లి బయ్యన్న, తుమ్మల పద్మ, చెర్కు పెద్దులు, దండు రవి, బొల్లెద్దు సైదులు, దండు నాగరాజు, అంతటి సత్యనారాయణ, మాదగోని సైదులు, దండు శంకరయ్య పాల్గొన్నారు.

ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



తిప్పర్తి ధాన్యం కొనుగోలు కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్, ఎస్పీ

మాడ్గులపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షానికి ధాన్యం తడవకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలను ఆదేశించారు. గురువారం ఎస్పీ శరత్‌చంద్రపవార్‌తో కలిసి మండలంలోని చిరుమర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీచేసి మాట్లాడారు. మొంథా తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఐకేపీ కేంద్రంలోని ధాన్యం తడిసి రంగు మారిపోగా, ధాన్యం కొనుగోలు విషయంలో చిరుమర్తి కొనుగోలు కేంద్రానికి అనుసంధానం చేసిన రైస్‌మిల్లుతో సమన్వయం చేసుకొని ధాన్యం దించుకునేలా చూడాలని డీఆర్‌డీవో శేఖర్ రెడ్డికి సూచించారు. టార్పాలిన్లు, లారీల సమస్య లేకుండా ముందే చూసుకోవాలని, నాణ్యత ప్రమాణాలతో వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలన్నారు. వారి వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఎస్‌వో వెంకటేష్, పౌరసరఫరాల డీఎం గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

తిప్పర్తి: ధాన్యం కొనుగోలు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. తిప్పర్తి మండలకేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత ధాన్యంపై కప్పడానికి కనీసం టార్పాలిన్ కవర్లు కూడా సెంటర్ నిర్వాహకులు ఇవ్వడం లేదని పలువురు రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సెంటర్ నిర్వాహకులు సరైన నిర్వహణ చేయడం లేదని తెలియజేయడంతో ఆగ్రహించిన కలెక్టర్ నిర్వాహకుడికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఆమెవెంట అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, నల్లగొండ ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, డీఎస్‌వో వెంకటేష్, గోపికృష్ణ, మార్కెటింగ్ ఏడీ చాయాదేవి, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, నల్లగొండ మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్ పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు జలకళ

- సాగర్ 14 గేట్ల నుంచి నీటి విడుదల
- 590 అడుగుల వద్ద నీటిమట్టం
- నిండుకుండలా శాలిగౌరారం ప్రాజెక్టు
- మూసీకి పోటెత్తిన వరద
- నీటమునిగిన అంభభవాని పంప్‌హౌస్



అలుగుపోస్తున్న డిండి ప్రాజెక్టు

7

ఓటర్ల జాబితా సవరణకు సర్

- అత్యంత సమర్థంగా సర్ నిర్వహణ
- ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సర్వేకు ఏర్పాట్లు

6

శిశు విక్రయాలకు పాల్పడితే కేసులు

జిల్లా సంక్షేమ అధికారి కె.కృష్ణవేణి

తిరుమలగిరి(సాగర్), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఎవరైనా శిశు విక్రయాలు, భ్రూణ హత్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని జిల్లా సంక్షేమ అధికారి కె.కృష్ణవేణి హెచ్చరించారు. గురవారం మండలకేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. మహిళలు గర్భం దాల్చిన మూడో నెలలోనే అంగన్‌వాడీ కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. ముందు ఆడపిల్లలు ఉండి, మళ్లీ కాన్పులో ఆడ పిల్ల పుడితే వారిని సాకలేని పరిస్థితి ఉంటే ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందిస్తే, వారిని శిశు గృహాలకు అప్పగిస్తామన్నారు. బాల్య వివాహాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీవో సువర్ణ, సూపర్‌వైజర్ యాదమ్మ, మహేష్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి

● ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సైదానాయక్



తరగతులను బహిష్కరించిన నాయకులు

మిర్యాలగూడ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుర్ర సైదానాయక్ కోరారు. గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీ మేరకు ఆరేళ్లుగా బకాయిపడిన రూ.8,150 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రైవేట్ కళాశాలల్లో ఫీజు బకాయిలు ఉండడంతో విద్యార్థులకు సర్టిఫికేట్లు ఇవ్వడం లేదన్నారు. బకాయి నిధుల విడుదల కోసం కళాశాల యాజమాన్యాలు బంద్‌కు పిలుపునిస్తే వారితో చర్చలు జరిపి రూ.1200 కోట్లు విడుదల చేస్తామని ప్రకటించి, మాట తప్పడంతో తిరిగి కళాశాలల మూసివేతకు యాజమాన్యాలు సమాయత్తమవుతున్నాయన్నారు. దీంతో పేద విద్యార్థుల భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముతున్నాయన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి బకాయిల విడుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి ప్రత్యక్ష పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జగన్‌నాయక్, వదూద్, న్యూమాన్, వీరన్న, కోటేష్, అనిల్, బన్నీ హనుమంతు, ఎస్ఎఫ్ఐ నల్లగొండ జిల్లా బాలికల కన్వీనర్ ప్రసన్న, నవ్య, కావ్య, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల్లేక పాఠశాల మూత

(ఆంధ్రజ్యోతి-తుర్కపల్లి)

రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి మౌలిక వసతులు కల్పించి ఏర్పాటుచేసిన యాదాద్రిభువనగిరి తుర్కపల్లి మండలం రామోజీనాయక్‌తండా ప్రాథమిక పాఠశాల నిరూపయోగంగా మారింది. ప్రభుత్వ పాఠశాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం సన్నగిల్లడంతో ఈ విద్యాసంవత్సరంలో ఉపాధ్యాయులు చేపట్టిన బడిబాటకు వారి నుంచి స్పందన లభించలేదు. ఉన్న ముగ్గురు విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు విద్యాబోధన చేసేవాడు. ఆ విద్యార్థులు కూడా పాఠశాలకు సక్రమంగా రాకపోవడంతో నెల రోజుల కిందట జిల్లా విద్యాశాఖాధికారులు ఆ పాఠశాలను మూసివేశారు. ఈ గ్రామం నుంచి సుమారు 25 మంది విద్యార్థులు సమీపంలోని వడవర్తి, భువనగిరి, బొమ్మలరామారం మండలం జలాల్‌పూర్ గ్రామాల్లోని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల మూసివేత అనంతరం ముగ్గురు విద్యార్థులను సమీపంలోని కర్షలగడ్డతండా ప్రాథమిక పాఠశాలకు పంపించారు. ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై పల్లెపహాడ్ ప్రాథమిక పాఠశాలకు కేటాయించారు.

వచ్చే ఏడాది అడ్మిషన్లు ఉంటే ప్రారంభిస్తాం

పాఠశాల మూతపడకుండా ఎన్ని ప్రయత్నాలు చేసినా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఎలాంటి సహకారం లభించలేదు. ముగ్గురు విద్యార్థులు ఉన్నా ఆ విద్యార్థులు కూడా సక్రమంగా రాకపోవడంతో పాఠశాలను మూసివేయాల్సి వచ్చింది. వచ్చే విద్యా సంవత్సరం అడ్మిషన్లు వస్తే పాఠశాలను తిరిగి ప్రారంభిస్తాం.

- వీరజాల మాలతి, మండల విద్యాశాఖాధికారి తుర్కపల్లి

వెల్మజాల గ్రామంలో గోడకూలి రెండు ఆవులు మృతి

గుండాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : యాదాఆద్రిభువనగిరి జిల్లా గుండాల మండలం వెల్మజాల గ్రామంలో బుధవారం రాత్రి వర్షానికి గోడ కూలి రెండు ఆవులు మృతి చెందాయి. నరాముల యాదయ్యకు చెందిన రెండు ఆవులను వ్యవసాయ బావి వద్ద కొట్టంలో కట్టివేశాడు. వర్షానికి గోడ కూలడంతో రెండు ఆవులు మృతి చెందాయి. దీంతో సుమారు రూ.లక్షా 60వేలు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆర్థికసాయం అందజేసి, ఆదుకోవాలని బాధితుడు కోరారు.

ఓటర్ల జాబితా సవరణకు సర్

రాష్ట్రంలో అమలుకానున్న ఎస్ఐఆర్(సర్) ›› ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సర్వేకు ఏర్పాట్లు



మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పిస్తున్న ఉన్నతాధికారులు (ఫైల్)

దేశంలో నివసించే 18 ఏళ్లు నిండిన వారందరికీ భారత రాజ్యాంగం ఆర్టికల్-326 ద్వారా కుల, మత, జాతి, లింగ, ప్రాంత, భాష అనే తారతమ్యం లేకుండా ఓటుహక్కు కల్పించారు. సమాజ నిర్మాణానికి పునాది అయిన ఓటు దేశ చరిత్రను, రాష్ట్రాల భవిష్యత్‌ను ప్రభావితం చేస్తోంది. అర్హత కలిగిన పౌరులందరూ ఓటు హక్కుతో తమ ప్రతినిధులను ఎన్నుకోవచ్చు. ప్రజాస్వామ్య పరిరక్షణకు వజ్రాయుధం లాంటి ఓటు దుర్వినియోగం కాకుండా ఎన్నికల సంఘం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా చేపట్టిన ప్రతిష్ఠాత్మక విధానమే ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్).

- (ఆంధ్రజ్యోతి - మిర్యాలగూడ టౌన్)

బిహార్ రాష్ట్ర శాసనసభా ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితా కోసం కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సర్వే చేపట్టింది. మలివిడతలో 12 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు ఆయా రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. నవంబరు 4న ప్రారంభమయ్యే ఈ సర్వే డిసెంబరు 4వ తేదీకి పూర్తి చేసేలా షెడ్యూల్‌ను ప్రకటించింది.

క్షేత్రస్థాయిలో పరిశీలన

బిహార్ రాష్ట్రంలో చేపట్టిన ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ప్రకంపనలు సృష్టించింది. ఓట్ల తొలగింపే లక్ష్యంగా ఎన్నికల కమిషన్(ఈసీ) ఎస్ఐఆర్ చేపట్టిందని, అర్హులైన లక్షలాది మంది ఓట్లను తొలగించారన్న విపక్షాల నిరసనలు హోరెత్తాయి. కొందరు దేశ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, పార్లమెంట్ పలు సమావేశాలో ఎస్ఐఆర్(సర్)కు వ్యతిరేక నినాదాలతో వాయిదాపడ్డాయి. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్‌ను అధికారులు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నారు. ప్రధానంగా గుర్తింపు పత్రాల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని గుర్తించారు. తుది జాబితా కూర్పు పారదర్శంగా ఉండేలా అధికారులు సన్నద్ధమవుతున్నారు.

సుదీర్ఘకాలం అనంతరం..

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్/సర్)ను ఎనిమిది సార్లు మాత్రమే నిర్వహించారు. చివరి సారిగా 2002-04 పర్యాయం చేపట్టారు. ప్రస్తుతం చేపడుతున్న ఎస్ఐఆర్ తొమ్మిదోసారి కావడంతో ప్రతిష్ఠాత్మకంగా ఓటర్లను నమోదు చేసేందుకు అవసరమైన యంత్రాగాన్ని సిద్ధం చేస్తున్నారు. సర్‌ను తొలిదిశలో బిహార్ రాష్ట్రంలో పూర్తిచేసిన ఎన్నికల సంఘం మలిదిశలో 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నిర్వహించి ఓటర్ల జాబితాను సవరించనుంది. అర్హులు ఏ ఒక్క ఓటరూ తుది జాబితా నుంచి తొలగించబోమని, అనర్హుల్లో ఏ ఒక్క ఓటరుకు చోటుదక్కనివ్వమని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంటోంది.

వివరాల సేకరణ ఇలా

ఎస్ఐఆర్‌లో భాగంగా ఎన్నికల సిబ్బంది 2002 ఓటరు జాబితాతో 2025 జాబితాను పోల్చి చూస్తారు. నాటి ఓటర్లు మినహా ప్రస్తుత ఓటర్లు ఎలా ఓటు హక్కు పొందారో, అందుకు ఎటువంటి గుర్తింపుపత్రాలు సమర్పించారో తెలుసుకుంటారు. వారికి ఓటుహక్కు కల్పించేందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, వివరాలు సేకరిస్తారు. నిర్ధారించేందుకు అవసరమైన పత్రాలు చూపని ఓటర్లను తొలగించి తుదిజాబితా రూపొందిస్తారు. అయితే ఈ తతంగాన్ని పూర్తి చేసేందుకు ఒకటికి రెండుసార్లు దరఖాస్తుదారుల(ఓటర్ల) పత్రాలను పరిశీలిస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.

అత్యంత సమర్థంగా సర్ నిర్వహణ



కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాను నిబంధనల మేరకు సవరించనున్నాం. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను అత్యంత సమర్థంగా నిర్వహించేందుకు ఏర్పాట్లుచేస్తున్నాం. నిబంధనలకు అనుగుణంగా ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ల వివరాలు సేకరిస్తాం. బీఎల్వోలు, సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించి, సంబంధిత పత్రాలు చూపించి, వివరాలు సమర్పించాలి.

- అమిత్ నారాయణ్, సబ్ కలెక్టర్, మిర్యాలగూడ.

ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గ వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
మిర్యాలగూడ	1,16,222	1,21,313	26	2,37,561
నాగార్జునసాగర్	1,16,278	1,21,300	19	2,37,597
దేవరకొండ	1,32,611	1,31,800	19	2,64,430
నల్లగొండ	1,22,222	1,29,133	56	2,51,411
మునుగోడు	1,29,235	1,30,688	3	2,59,926
నకిరేకల్	1,25,991	1,29,316	4	2,55,311
హుజూర్‌నగర్	1,22,663	1,30,430	17	2,53,110
కోదాడ	1,20,150	1,27,077	20	2,47,247
సూర్యాపేట	1,19,999	1,25,424	14	2,46,437
తుంగతుర్తి	1,29,654	1,31,697	6	2,61,357
ఆలేరు	1,18,297	1,19,931	20	2,38,248
భువనగిరి	1,09,820	1,12,830	1	2,22,251

గెట్టు పంచాయితీ కేసులో నలుగురికి జైలుశిక్ష

తిరుమలగిరి / తిరుమలగిరి రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ బావి వద్ద గెట్టు వివాదం కేసులో తుంగతుర్తి కోర్టు న్యాయమూర్తి ఎండీ గౌస్‌పాషా నలుగురికి జైలుశిక్షతో పాటు జరిమానా విధించినట్లు సూర్యాపేట జిల్లా తుంగతుర్తి ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తిరుమలగిరి మండలం బండ్లపల్లి గ్రామానికి చెందిన లింగంపల్లి నరసింహస్వామి, లింగంపల్లి వెంకటేశ్వర్లు, లింగంపల్లి లక్ష్మి, లింగపల్లి సుజాతలపై వ్యవసాయ బావి వద్ద గెట్టు వివాదంలో అప్పటి ఎస్ఐ రవీందర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గురువారం కోర్టులో వాదనలు విన్న జడ్జి నలుగురు నిందితులకు ఆరు నెలల సాధారణ జైలుశిక్షతో పాటు, ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమంగా చెట్లను కొట్టివేసినందుకు జరిమానా

భువనగిరి రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : దేవాలయ ఆవరణలో వేపుగా పెరిగిన చెట్లను నరికిన వారిపై అటవీశాఖ అధికారులు జరిమానా విధించారు. యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం తాజ్‌పూర్ గ్రామంలో త్రిలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వేపుగా పెరిగిన చెట్లను ఆలయ కమిటీ సభ్యులు నరికివేసి ఆ కలపను విక్రయించారు. అటవీ శాఖ రేంజ్ అధికారి నరేశ్‌నాయక్ విచారణ చేపట్టి కమిటీ సభ్యులకు రూ.12,160 జరిమానా విధించారు. భవిష్యత్‌లో చెట్లను నరికితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భువనగిరి వైన్స్‌లో చోరీ

భువనగిరి టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరిలోని లక్ష్మీ వైన్స్‌లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. హౌసింగ్ బోర్డు కాలనీ ఎదురుగా ఉన్న వైన్స్ వెనుక నుంచి లోనికి ప్రవేశించిన దొంగలు కౌంటర్‌లోని రూ.50 వేల నగదు, ఐదు మద్యం సీసాలను చోరీ చేశారు. సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్‌ను కూడా ఎత్తుకెళ్లారు. బుధవారం వైన్స్‌కు తాళాలు వేసి వెళ్లిపోయిన సిబ్బంది గురువారం ఉదయం తెరిచేందుకు రాగా చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈ మేరకు వైన్స్ సిబ్బంది విజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కౌంటర్‌ను చిందరవందరం చేసిన దొంగలు

నిర్లక్ష్యం ఖరీదు నిండు ప్రాణం

- ఎల్‌సీ తీసుకోకుండానే మరమ్మతులు
- మోత్కూరు మండలంలో

విద్యుదాఘాతంతో అసిస్టెంట్ లైన్‌మన్ మృతి







సురేష్(ఫైల్), భువనగిరిలో రాస్తారోకో చేస్తున్న బంధువులు, ఆసుపత్రి వద్ద భార్య, పిల్లలు

మోత్కూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : చిన్న నిర్లక్ష్యానికి ఓ విద్యుత్ ఉద్యోగి నిండు ప్రాణం బలైంది. ఈ సంఘటన గురువారం యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం పాలడుగు శివారులో జరిగింది. గ్రామస్థులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం దత్తప్పగూడెం గ్రామానికి చెందిన ఓర్సు సురేష్(33) ఐదేళ్లుగా విద్యుత్‌శాఖలో అసిస్టెంట్ లైన్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 29న భారీ వర్షానికి పాలడుగు శివారులోని బొడిగె కిష్టయ్య వ్యవసాయ బావి సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె కుంగి, ట్రాన్స్‌ఫార్మర్ పక్కకు ఒరిగి విద్యుత్ సరఫరా నిలిచింది. ఏఈ ప్రభాకర్‌రెడ్డి, మరో హెల్పర్, ఏఎల్‌ఎం సురేష్‌తో కలిసి అక్కడకు వెళ్లారు. ఎల్‌సీ తీసుకోకుండా(విద్యుత్ సరఫరా నిలిపివేయకుండా) విద్యుత్ స్తంభంపై జంపర్లు కట్ చేసి ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనులు ప్రారంభించారు. ట్రాన్స్‌ఫార్మర్ సరి చేసే క్రమంలో విద్యుత్ వైర్‌కు విద్యుత్ సరఫరా ఉన్న లైన్ తాకడంతో సురేష్ విద్యుదాఘాతానికి గురై స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే సీపీఆర్ చేసి చికిత్సనిమిత్తం అతడిని ప్రైవేట్ వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. సురేష్‌కు భార్య, ముగ్గురుపిల్లలు ఉన్నారు. సురేష్ కుటుంబానికి రూ.50లక్షలఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కార్యవర్గసభ్యుడు ఇమ్రాన్‌తో కలిసి భువనగిరి ఏరియా ఆస్పత్రిలో సురేష్ భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆందోళనలు.. రోదనలు

భువనగిరి టౌన్ : మోత్కూర్ మండలం పాలడుగులో విద్యుదాఘాతంతో మృతి చెందిన అసిస్టెంట్ లైన్‌మన్ సురేష్ బంధుమిత్రులు గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఆందోళనకు దిగారు. మృతదేహన్ని పోస్టుమార్టం కోసం ఉదయమే జిల్లా ఆస్పత్రికి తరలించగా న్యాయం చేయాలంటూ బంధుమిత్రులు చేపట్టిన ఆందోళనలతో వైద్యులు పోస్టుమార్టం చేయలేదు. అధికారుల పనిఒత్తిడి, నిర్లక్ష్యంతోనే సురేష్ మృతి చెందాడని ఆరోపిస్తూ విద్యుత్‌ఉద్యోగుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో డీఈ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పడిగం యాదగిరి, అమర్నాథ్, విద్యుత్ బీసీ అసోసియేషన్ కార్యదర్శి బొబ్బిలి మురళీ, విద్యుత్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దొడ్డి యాదగిరి, రాజేష్, 327 యూనియన్ ప్రతినిధి కుసంగి శ్రీనివాస్, హెచ్‌ఎంటీ ప్రతినిధి బొట్ల రమేష్ పాల్గొన్నారు. అలాగే ప్రమాదానికి కారణమైన ఏఈపై చర్యలు తీసుకోవాలని బంధుమిత్రులు ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం పెద్దసంఖ్యలో జిల్లా ఆస్పత్రి ఎదురుగా పట్టణ ప్రధానరహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా పోలీసులు, ఆందోళనకారుల నడుమ వాగ్వాదం జరిగింది. సురేష్ బంధుమిత్రుల రోదనలు మిన్నంటాయి. భార్య అనూష, ముగ్గురు కుమారులు శివ, నందకిషోర్, బిహార్ రోదించిన తీరు అందరిని కంటతడి పెట్టించింది. పోలీసులు సముదాయించడంతో ఆందోళనను విరమించారు.

తౌడు నూనె ప్యాకెట్లకు పల్లీ నూనె స్టిక్కర్లు



వైదేహీ పరిశ్రమలో రికార్డులను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి జ్యోతిర్మయి, శివశంకర్‌రెడ్డి

చిట్యాల రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రైస్ బ్రాన్(తౌడు నూనె) ఆయిల్ ప్యాకెట్లకు పల్లీ నూనె స్టిక్కర్లు అంటించి సిద్ధం చేసిన నూనె కాటన్లను ఫుడ్ సేఫ్టీ జోనల్ అధికారి జ్యోతిర్మయి సీజ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నూనె తయారీ కేంద్రాల్లో ఫుడ్‌సేఫ్టీ అధికారులు గురువారం చేపట్టిన తనిఖీల్లో భాగంగా నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తిలోని వైదేహీ ఆగ్రో ఆయిల్ పరిశ్రమను అధికారులు తనిఖీ చేశారు. వైదేహీ పరిశ్రమలో మొదటగా తనిఖీ కోసం వచ్చిన జిల్లా అధికారి శివశంకర్‌రెడ్డి తనను పరిచయం చేసుకుని పరిశ్రమలోకి వెళ్తుండగా యాజమాన్యం, సిబ్బంది అడ్డుకున్నారు. ఈ విషయంలో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. దీంతో శివశంకర్‌రెడ్డి ఫుడ్‌సేఫ్టీ జోనల్ అధికారి జ్యోతిర్మయికి ఈ విషయాన్ని తెలిపారు. వెంటనే వట్టిమర్తికి వచ్చిన ఆమె జిల్లా అధికారితో కలిసి పరిశ్రమలో తనిఖీలు చేపట్టాలరు. పరిశ్రమలలో ఉన్న నూనె ప్యాకెట్‌లను పరిశీలించగా అక్కడ తయారు చేస్తున్న నూనెలో రైస్‌బ్రాన్(తౌడు నూనె) ఆయిల్‌ను 80శాతం, 20శాతం పల్లీ నూనెను కలిపి నూనెను తయారు చేస్తున్నారు. అయితే ఆ నూనెను పల్లీ నూనెగా ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నట్లుగా గుర్తించారు. ఈ విధంగా చేయడం సరికాదని ప్రజలకు తప్పుదోవ పట్టించడమేనన్నారు. అక్కడే విక్రయానికి సిద్ధంగా ఉన్న ప్యాకెట్ల కాటన్లు, నూనెను ప్యాకింగ్‌కు సంబంధించిన స్టిక్కర్ల ఫిలిమ్స్‌లను(లేబుల్) పరిశీలించారు. విక్రయానికి సిద్ధం చేసిన 400 నూనె ప్యాకెట్ల కాటన్లు ఉండగా అందులో 100 కాటన్లను సీజ్ చేశారు. మిగతా వాటిని పరిశ్రమలోనే భద్రపరిచారు. అంతేకాకుండా నూనె ప్యాకెట్లను, కవర్లు, స్టిక్కర్లను(లేబుల్) కూడా సీజ్ చేశారు. నూనె శాంపిల్ సేకరించారు. ల్యాబ్ పరీక్షల అనంతరం చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. మొత్తం 1,600 లీటర్ల నూనె ప్యాకెట్లు, సుమారు 4,800 కిలోల స్టిక్కర్లను సీజ్ చేసినట్లు జ్యోతిర్మయి తెలిపారు. వాస్తవికంతో కూడిన లేబుల్‌ను మార్చుకోవాలని సూచించారు.

108లో మహిళ ప్రసవం: తల్లీబిడ్డా క్షేమం

పెద్దవూర, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలో 108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవించింది. వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రంపోడు మండలం ముసంగి గ్రామానికి చెందిన నిరసనమెట్ల దేవదాసు భార్య కృపాదాను గురువారం ఉదయం ఆరు గంటలకు పురిటినొప్పులతో బాధపడుతుండగా కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంటనే చేరుకున్న 108 సిబ్బంది కృపాదాసును ఆసుపత్రికి తీసుకెళ్తుండగా పెద్దవూర మండలం లింగంపల్లి గ్రామం వద్దకు రాగానే పురిటి నొప్పులు అధికమయ్యాయి. 108 అంబులెన్స్ ఈఎంటీ సునీల్‌కుమార్, పైలట్ రాజేష్‌లు ఆమెకు ప్రసూతి చేశారు. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారని, ఆపద సమయంలో 108 సిబ్బంది సేవలు అందించారని కుటుంబసభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.



బాబును అందజేస్తున్న 108 సిబ్బంది

బైక్‌పై వాగు దాటుతూ అంగన్‌వాడీ టీచర్ మృతి



కృష్ణవేణి(ఫైల్)

భువనగిరి రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ రంగారెడ్డి జిల్లా శివారులో వాగులో కొట్టుకుపోయి మృతి చెందింది. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని నందనం సెక్టార్-1వ అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన అంగన్‌వాడీ టీచరు రచ్చ కృష్ణవేణి(44) రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం బాటసింగారంలో నిర్వహిస్తున్న తండ్రి ఐదు దినాల కార్యక్రమానికి భర్త రచ్చ ప్రభాకర్‌తో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్లారు. గురువారం సాయంత్రం ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వస్తూ మార్గమధ్యలోని బాటసింగారం శివారులో వాగు కల్వర్టుపై నుంచి వస్తున్నారు. ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం పైనుంచి ఆమె జారి కిందపడిపోయింది. వాగులో కొట్టుకుపోతుండగా భర్త ప్రభాకర్ ప్రయత్నించి వాగులోంచి బయటకు తీసినప్పటికీ ఆమె ప్రాణాలను కాపాడలేకపోయారు. కృష్ణవేణి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించినట్లు భర్త రచ్చ ప్రభాకర్ తెలిపారు.

చికిత్సపొందుతూ మరో యువకుడు



రిషికేష్(ఫైల్)

నార్కట్‌పల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ యువకుడు గురువారం మృతి చెందాడు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన దుర్గం రిషికేష్ (18) ఈ నెల 18వ తేదీన స్థానిక అమ్మనబోలుకు వెళ్లే దారిలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన సంఘటనలో ద్విచక్రవాహనంపై ఉన్న కొత్త శేఖర్ మృతి చెందగా, రిషికేష్ తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. 10 రోజుల పాటు చికిత్స పొందుతున్న రిషికేష్ గురువారం మృతి చెందాడు.

జాన్‌పహాడ్‌లో గుర్తుతెలియని వృద్ధురాలు



పాలకవీడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలో గుర్తుతెలియని వృద్ధురాలు మృతి చెందింది. ఎస్ఐ కోటేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకరాం పాలకవీడు మండలం జాన్‌పహాడ్ దర్గా పరిసర ప్రాంతంలో గుర్తుతెలియని వృద్ధురాలు(60) కొంతకాలంగా బిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తోంది. గురువారం ఉదయం మృతి చెంది ఉండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని వృద్ధురాలి మృతదేహన్ని హుజూర్‌నగర్ ఏరియాసుపత్రికి తరలించారు. వృద్ధురాలిని ఎవరైనా గుర్తిస్తే పాలకవీడు పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ కోటేష్ కోరారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



మల్లికార్జున్(ఫైల్)

పేట్‌బషీరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాకు చెందిన బీటెక్ విద్యార్థి హైదరాబాద్‌లోని మైసమ్మగూడలో ఆత్మహత్య చేసుకున్నాడు. పేట్‌బషీరాబాద్ సీఐ విజయవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా దామరచర్ల కృష్ణారావు కాలనీకి చెందిన పూర్ణచందర్‌రావు రెండో కుమారుడు పీ మల్లికార్జున్(19) మల్లారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఆర్ఐటీ)లో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతూ మైసమ్మగూడలోని సిరి డీలక్స్ వసతి గృహంలో ఉంటున్నాడు. మల్లికార్జున్ ఈ నెల 29వ తేదీ ఉదయం పరీక్ష రాసి వసతిగృహానికి వచ్చాడు. వసతిగృహంలో ఉంటున్న జయంత్, సురేష్‌తో పాటు పలువురు స్నేహితులతో రాత్రి 10.30 గంటల వరకు మాట్లాడి తన గదికి వెళ్లాడు. అదేరోజు రాత్రి 11.45 గంటలకు స్నేహితులు తలుపు కొట్టగా మల్లికార్జున్ స్పందించలేదు. తలుపులు తీయకపోవడంతో వారు వసతిగృహం యజమానికి సమాచారమిచ్చారు. తలుపులు పగులగొట్టి చూడగా మల్లికార్జున్ ఉరేసుకుని వేలాడుతూ ఉన్నాడు. కిందకు దించి సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రేమ విఫలమై ఆత్మహత్య చేసుకొని ఉంటాడని భావిస్తున్నారు.

వరదకు కొట్టుకుపోయిన చేపలు

- రూ.లక్షల్లో నష్టపోయాం:మత్స్యకారులు

నాంపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నాంపల్లి మండలంలో ఇటీవల భారీ వర్షాలకు చెరువులు అలుగు పోయడంతో చేపలన్నీ కొట్టుకుపోయాయి. దీంతో రూ.లక్షల్లో మత్స్యకారులు నష్టపోయారు. మండలంలోని రేవెల్లి, కేతేపల్లి, పసునూరు చేపల చెరువుల్లో చేపలు పెంచారు. ఇటీవల అలుగులు పోయడంతో రూ.15లక్షల విలువైన చేపలు కొట్టుకుపోయినట్లు మత్స్యకారులు తెలిపారు. చేపలు పెరిగి చేతికొచ్చే సమయానికి నష్టం వచ్చిందని, ప్రభుత్వం ఆదుకోవాలని మత్స్యకారులు కోరారు.



రేవల్లి అలుగు నుంచి పోతున్న చేపలు

ప్రభుత్వం ఆదుకోవాలి



రేవెల్లి చెరువులో చేపపిల్లలు వదిలాం. రూ.10లక్షల వరకు పెట్టుబడులు పెట్టాం. వర్షంతో చెరువు నిండి చేపలు వర్షపు నీటికి దిగువ భాగానికి కొట్టుకుపోయాయి. చేతికొచ్చిన దశలో చేపలు కొట్టుకుపోయాయి. దీంతో నష్టపోయే పరిస్థితి. ప్రభుత్వం ఆదుకోవాలి.

మేకల రాములు, రేవెల్లి చేపల చెరువు మత్స్య సహకార సొసైటీ అధ్యక్షుడు

జెన్‌కో అభివృద్ధికి పాటుపడతాం



నిఘా అవగాహన వారోత్సవంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెన్‌కో సీఈ మంగేష్ కమార్

నాగార్జునసాగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సంస్థ అభివృద్ధికి పాటుపడతామని జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్ అన్నారు. జెన్‌కోలో నిఘా (విజిలెన్స్) వారోత్సవాలను సీఈ గురువారం ప్రారంభించారు. ఉదయం 10:30 గంటలకు ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉద్యోగులు సంస్థ అభివృద్ధికి పాటుపడతామన్నారు. నీతి నిజాయితీగా పనిచేస్తామన్నారు. వ్యాపార నిర్వహణలో చట్టాలు, నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జెన్‌కో సీఈలు రఘురాం, రామకృష్ణారెడ్డి, ఇంజనీర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బుర్గులతండాలో 12అడుగుల కొండచిలువ



నేరేడుచర్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సూర్యా పేట జిల్లా నేరేడుచర్ల మండలం బూర్గులతండాలో గురువారం సుమారు 12 అడుగుల కొండ చిలువ కన్పించింది. భయంతో గ్రామస్థులు దానిని కొట్టి చంపేశారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకా రం.. మూడు రోజుల క్రితం నాలుగు కేజీల కోడిపుం జును కొండచిలువ చుట్టివేసిందని, జనాలు గుమిగడేసరికి చెట్ల పొదల్లోకి పోయిందని తెలిపారు. గురువారం తిరిగి ఐదు కేజీల కోడి పుంజును చుట్టుకొని ఉండగా పటాన్ రాంజాన్ అనే వ్యక్తి గమనించి గ్రామస్థులకు సమాచారం అందించారు. గ్రామస్థులందరూ కలిసి భయంతో రాళ్లు, కర్రలతో కొండ చిలువను కొట్టి చంపారు. మరో కొండచిలువ సంచరిస్తోందని భయపడుతున్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా సాయిమందిరం



108 కలశాలతో భక్తులు, ముస్తాభైన సాయినాధుడు

హాలియా, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): షిరిడీ సాయిమందిరం ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోందని హాలియా మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నల్లగొండ జిల్లా గౌరవ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా హాలియాలోని షిరిడీసాయిమందిరం 20వ వార్షికోత్సవంలో వారు మాట్లాడారు. సాయిమందిరంలో నిత్యం పూజా కార్యక్రమాలతో పాటు ధ్యాన కేంద్రంగా కూడా భక్తులకు ఉపయోగపడుతుందన్నారు. తెల్లవారుజామున కాగడహారతితో వార్షికోత్సవ పూజా కార్యక్రమాలు ప్రారంభమై 108 కలశాలతో శతకటాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. భారీగా తరలివచ్చిన భక్తులు సాయిబాబాకు క్షీరాభిషేకం నిర్వహిం చారు. సాయంత్రం హాలియా పురవీధుల్లో స్వామివారి శోభాయాత్ర కోలాటాలు, డప్పు వాయిద్యాలతో వైభవంగా నిర్వహించారు. స్వామివారి అన్నప్రసాద షెడ్ నిర్మాణానికి మాజీ అధ్యక్షుడు మిట్టపల్లి వాసులు రూ.లక్ష విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో ధర్మకర్త మిట్టపల్లి సుబ్బారావు, అధ్యక్షుడు తేలపోలు శేఖర్, కార్యదర్శి సక్రునాయక్, కోశాధికారి మిట్టపల్లి శివకుమార్, కమిషనర్ రామదుర్గారెడ్డి, ఎంపీడీవో సుజాత, మిట్టపల్లి వాసులు, వీరమళ్ల కృష్ణయ్య, చీదళ్ల లింగయ్య, భూపాల్‌రెడ్డి, రంగా రంజీత్, కుక్కడపు రమేష్, శేఖర్, యాదగిరి, మంచికంటి శ్రీను, రవీందర్, వేణు, చిననారాయణ, ఆంజనేయులు, నాగిరెడ్డి, సోమయ్య, రేపాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

యాదగిరిగుట్ట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో నిత్య కైంకర్యాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్స వం నిర్వహించారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం, పూజలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో జరిగాయి. కొండపైన శివాలయంలో పర్వతవర్థిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.10,64,924 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో హరీష్ తెలిపారు.

పీజీ బ్యాక్‌లాగ్ ఫలితాలు విడుదల

నల్లగొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ పరిధిలో పీజీ విద్యార్థులకు ఆగస్టులో నిర్వహించిన బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను గురువారం విడుదల చేసినట్లు సీవోఈ ఉపేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సెమిస్టర్‌లో 52.34శాతం, రెండో సెమిస్టర్‌లో 41.74శాతం, మూడో సెమిస్టర్‌లో 37.50శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఫలితాలు పూర్తి వివరాలను ఎంజీయూ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు తెలిపారు.

సేవా భావం అలవర్చుకోవాలి

తిరుమలగిరి(సాగర్), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే సేవా భావం అలవర్చుకోవాలని ఇంటర్ బోర్డు కార్యదర్శి భీమ్‌సింగ్ అన్నారు. నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండల పరిధిలోని జమ్మనకోట, నాగార్జునపేటలలో ఎన్ఎస్ఎస్ 1,2 శీతాకాల ప్రత్యేక శిబిరం ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిసరాల పరిశుభ్రత, నీటి నిల్వ, పచ్చదనం అంశాలపై అవగాహన కల్పించడంతోపాటు పేద ప్రజల్లో నెలకొన్న సాంఘిక దురాచారాలను తరిమికొట్టేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానాచార్యులు రాజశేఖర్, ప్రోగ్రాం ఆఫీసర్లు చింతపల్లి వెంకటయ్య, ప్రసన్నలక్ష్మీ, సతీష్‌చంద్ర, బంగారు ఉపేంద్రచారి, గోపాలకృష్ణ, జనార్ధన్, సైదమ్మ, మాధురి, శంకర్, మణి, గోపినాథ్, హెచ్ఎం భాస్కర్‌గౌడ్, గోపయ్య, కవిత, తనూజ ఉన్నారు.

ప్రాజెక్టులకు జలకళ

- సాగర్ 14 గేట్ల నుంచి నీటి విడుదల
- 589.90 అడుగుల వద్ద సాగర్ నీటి మట్టం
- నిండుకుండలా శాలిగౌరారం ప్రాజెక్టు
- మూసీకి పోటెత్తిన వరద
- నీటమునిగిన అంభభవాని పంప్‌హౌస్



అలుగుపోస్తున్న డిండి ప్రాజెక్టు

నాగార్జునసాగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు 14క్రస్ట్ గేట్ల నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువనుంచి వస్తున్న వరద ప్రవాహం మేరకు బుధవారం రాత్రి 20 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయగా, వరద రాక తగ్గుతుండటంతో గేట్లను మూసివేస్తూ గురువారం సాయంత్రానికి నాలుగు గేట్ల నుంచి నీటిని దిగువకు విడుదల చేశారు. వరద పెరగటంతో మరో 10గేట్లు ఎత్తి 14గేట్ల నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా గురువారం రాత్రి 590 అడుగులుగా (312.0450టీఎంసీలు) నమోదైంది. సాగర్ నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,333 క్యూసెక్కులు, 14 గేట్ల నుంచి 1,13,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 1,46,733 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుండగా ఎగువనుంచి 1,46,733 క్యూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరుతోంది. సాగర్ నుంచి కుడి, ఎడమ, వరద కాల్వలకు, ఎస్ఎల్‌బీసీకి నీటి విడుదలను నిలిపివేశారు.

పులిచింతలకు కొనసాగుతున్న వరద

చింతలపాలెం: పులిచింతల ప్రాజెక్టుకు వరద భారీగా కొనసాగుతోంది. బుధవారం రాత్రి 11 గంటల నుంచి ప్రాజెక్టుకు 2,38000 క్యూసెక్కుల వరద చేరింది. ఔట్‌ఫ్లో 2,37,897 ఐదు గేట్లు 4.5మీటర్లు, రెండు గేట్లు 3.5మీటర్లు ఎత్తి దిగువకు విడుదల చేశారు. గురువారం ఉదయం ఏడు గంటలకు వరద పెరగడంతో 4,83, 000ల క్యూసెక్కులు. 14 గేట్లు. 4.5 మీటర్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. సాయంత్రం ఏడు గంటలకు వరద తీవ్రత తగ్గడంతో 98,285 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నీట మునిగిన పంప్‌హౌస్



దేవరకొండ: మొంథా తుపానుతో కురిసిన వర్షాలకు పెండ్లిపాకల రిజర్వాయర్, డిండి, భీమనపల్లి ప్రాజెక్టులు నిండాయి. ఉప్పువాగు, మైనంపల్లి వాగు, తాటికోలు, గొట్టిముక్కల వాగులు ప్రవహిస్తున్నాయి. డివిజన్‌లో 18సెంటీమీటర్లకుపైగా వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. గొట్టిముక్కల రిజర్వాయర్‌లోకి భారీగా వరదనీరు చేరింది. అప్రమత్తమైన అధికారులు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. నేరేడుగొమ్ము మండలం పెద్దమునిగల్‌లో నిర్మిస్తున్న అంభభవాని ఎత్తిపోతల పథకం పంపుహౌస్‌లోకి భారీగా వరదనీరు చేరడంతో నీట మునిగింది. దీంతో ఎత్తిపోతల పనులు నిలిపివేశారు.

పేర్వాల, తాటికోలు, మైనంపల్లి, ఉప్పువాగు ప్రవహిస్తున్నాయి. దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీసు, నీటిపారుదలశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. చందంపేట, దేవరకొండ, కొండమల్లేపల్లి మండలాల్లోని రోడ్లు దెబ్బతిన్నాయి. దేవరకొండ పట్టణంలోని 3వ వార్డు, 10వ వార్డు లోతట్టు కాలనీలకు వర్షపునీరు చేరడంతో మునిసిపల్ అధికారులు ఎక్సకవేటర్ సాయంతో నీటిని దిగువ ప్రాంతాలకు మళ్లించారు.

డిండి ప్రాజెక్టుకు తగ్గిన ఇన్‌ఫ్లో

డిండి: డిండి ప్రాజెక్టుకు గురువారం ఇన్‌ఫ్లో తగ్గింది. ఎగువ నుంచి 24వేల క్యూసెక్కుల వరద ప్రవాహం దుందుభి నది ద్వారా ప్రాజెక్టుకు వచ్చి చేరుతున్నట్లు ప్రాజెక్టు జేఈ పరమేష్ తెలిపారు. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 36 అడుగులు(2.4 టీఎంసీలు) గరిష్ఠస్థాయికి చేరింది. భారీ వర్షాల కారణంగా ఎగువ నుంచి వచ్చే వరదనీరు స్పిల్‌వే, వియర్ నుంచి 24వేల క్యూసెక్కులు దిగువకు విడుదలై నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్‌లో చందంపేట మండలం దేవరచర్ల వద్ద కలుస్తుంది.



నిండుకుండలా శాలిగౌరారం ప్రాజెక్టు

శాలిగౌరారం: జిల్లాలో మధ్య తరహా ప్రాజెక్టులో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టు నిండుకుండలా జలకల సంతరించుకుంది. నుంచి కురుస్తున్న వర్షాలకు మూసీ నది ఫీడర్ చానల్ ద్వారా ప్రాజెక్టు లోకి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు పూర్తిగా నీటితో కళ కళ లాడుతుంది. ప్రస్తుతం కుడి, ఎడమ కాలువల ద్వారా వానాకాలం పంటలకు నీరందుతుంది. మండలంలోని చెరువులు కుంటల్లో కూడా నీరు సమృద్ధిగా ఉండటంతో జలకళ సంతరించుకున్నాయి. మండల రైతులు ఆనందంలో ఉన్నారు.


మూసీకి పోటెత్తిన వరద

కేతేపల్లి: మూసీకి వరద పోటెత్తడంతో ప్రాజెక్టు ఎనిమిది క్రస్టుగేట్లను నాలుగు అడుగుల మేర ఎత్తి ప్రాజెక్టులో నీటిని దిగువకు విడుదల చేశారు. మూసీకి ఉప నదులుగా ఉన్న ఆలేరు, బిక్కేరు నదులు ఉధృతంగా ప్రవహిస్తుండడం, హైదరాబాద్‌లోని ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లు ఉప్పొంగడంతో క్రమంగా పెరుగుతూ వచ్చిన ఇన్‌ఫ్లో గురువారం ఉదయం 49791క్యూసెక్కులకు చేరింది. దీంతో మూసీ అధికారులు అప్పటి వరకు నాలుగు అడుగులు ఎత్తి ఉంచిన ప్రాజెక్టు 8క్రస్టుగేట్లను 10అడుగులకు పెంచి ఇన్‌ఫ్లోకు సమానంగా 49791క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఆ తర్వాత పెరుగుతూ, తగ్గుతూ వచ్చిన ఇన్‌ఫ్లో గురువారం సాయంత్రానికి తగ్గుముఖం పట్టి 33931.55 క్యూసెక్కులుగా నమోదైంది.



లక్ష్యం అధిగమించి విద్యుత్ ఉత్పత్తి

● ఈ ఏడాది లక్ష్యం 1450 మిలియన్ యూనిట్లు.. ప్రస్తుత ఉత్పత్తి 2012.23 మిలియన్ యూనిట్లు



నాగార్జునసాగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు ప్రధాన జలవిద్యుత్ కేంద్రం విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించింది. ఈ ఏడాది విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం 1450 మిలియన్ యూనిట్లు కాగా, గురువారం సాయంత్రానికి 2012.23 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అయిందని సీఈ మంగేష్‌కుమార్ తెలిపారు. దీంతో జెన్‌కోకు ఇప్పటివరకు రూ.400 కోట్ల ఆదాయం సమకూరినట్లు పేర్కొన్నారు. 18సంవత్సరాల తర్వాత ఈ ఏడాది సాగర్‌కు జూలై నెలలో వరద రావడంతో పూర్తి స్థాయి లో విద్యుత్ ఉత్పత్తిని జూలై 29వ తేదీ నుంచి ప్రారంభించామని తెలిపారు. ఈ ఏడాది విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం 1450 మిలియన్ యూనిట్లు కాగా రెండు నెలల్లో సెప్టెంబరు 30వ తేదీ మధ్యాహ్నం నాటిని విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకున్నట్లు తెలిపారు. సాగర్ ప్ర ధాన జలవిద్యుత్ కేంద్రంలో మొత్తం ఎనిమిది టర్బైన్లు ఉండగా, ఒక్కో టర్బైన్ నుంచి 110 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉందని, 2023-24 ఆర్థిక సంవ త్సరంలో సాగర్‌కు ఎగువ నుంచి వరద రాకపోవడంతో ఆ ఏడాది ప్రభుత్వం క్రాప్ హాలిడే ప్రకటించారు. దీంతో ఆ ఏడాది లక్ష్యం 1400 మిలియన్ యూనిట్లు కాగా, కేవలం 540.83 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను మాత్రమే ఉత్పత్తి చేసినట్లు సీఈ తెలిపారు.

ఈ ఏడాది 3వేల మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేస్తాం

సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో ఈ ఏడాది ఉన్నతాధికారులు నిర్ణయించిన 1450 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని రెండు నెలల్లో చేరుకున్నాం. ఎగువ నుంచి వరద రాక మరో రెండు నెలలు ఇలాగే కొనసాగితే ఈ ఏడాది 3వేల మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తాం. దీంతో జెన్‌కోకు సుమారు రూ.1500 కోట్ల ఆదాయం సమకూరుతుంది.

● మంగేష్‌కుమార్, జెన్‌కో సీఈ

అప్రమత్తతతో తప్పిన పెనుముప్పు

● కోతకు గురైన శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారి



కోతకు గురైన శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారి

డిండి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అధికారుల అప్రమత్తతో శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై పెను ప్రమాదం తప్పింది. భారీ తుపాన్‌తో డిండి ప్రాజెక్టుకు మునుపెన్నడూ లేని విధంగా వరద ప్రవాహం పోటెత్తింది. ఎగువ నుంచి 36వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో దుందుభి వాగు నుంచి బుధవారం డిండి ప్రాజెక్టుకు వచ్చి చేరింది. దీంతో స్పిల్‌వే వియర్ నుంచి అంతేనీరు దిగువకు విడుదలవుతోంది. ఎప్పటిలాగానే జాతీయ రహదారి 765 శ్రీశైలం- హైదరాబాద్ వాహనాల రాకపోకలు కొనసాగుతూ వచ్చాయి. క్రమంగా నీటి ఉధృతి పెరగడంతో వియర్ దిగువన శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారి 765పై ఉన్న బిడ్జి పైనుంచి నీటి ప్రవాహం పెరిగింది. హైవేపై వరద ఉధృతికి రోడ్డు కోతకు గురైంది. నీటి ప్రవాహం ఉండడంతో కోతకు గురైన విషయం స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ బాలకృష్ణ ఉన్నత అధికారులకు సమాచారం ఇచ్చారు. జాతీయ రహదారిపై రెండువైపుల వాహనాలను నిలిపివేశారు. నీటి ఉధృతికి క్రమంగా బుధవారం అర్ధరాత్రి రోడ్డు పూర్తిగా తెగిపోయింది. వాహనాల నిలిపివేత వల్ల పెను ప్రమాదం తప్పిందని అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆర్టీసీ బస్సుల దారి మళ్లింపు

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులతోపాటు ఇతర డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు శ్రీశైలం నుంచి హైదరాబాద్‌కు డిండి మీదుగా వెళుతుంటాయి. ప్రతిరోజూ సుమారు వంద బస్సులకుపైగా శ్రీశైలం - హైదరాబాద్ జాతీయ రహదారిపై వెళుతుంటాయి. రోడ్డు కోతకు గురికావడంతో బస్సులను అధికారులను నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునూతల, చింతపల్లి, సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లి మీదుగా దారి మళ్లించారు. కొట్టుకుపోయిన శ్రీశైలం - హైదరాబాద్ ప్రధాన రహదారిపై రాకపోకలు పునరుద్ధరించేందుకు అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. నీటిని ఒకవైపు మళ్లించి ప్రధాన రహదారిపై ఏర్పడిన గండిని మట్టితో నింపుతున్నారు. త్వరితగతిన కోతకు గురైన గండిని పూడ్చి వాహనాలను పునరుద్ధరిస్తామని అధికారులు చెబుతున్నారు.

సూర్యాపేట- మిర్యాలగూడెం రూట్‌లో బస్సు సర్వీసులు రద్దు

కేతేపల్లి: వరద నీటి ప్రభావంతో సూర్యాపేట-మిర్యాలగూడెం పట్టణాల మధ్య భీమారం మీదుగా గల రహదారిపై గురువారం రెండో రోజూ వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వర ద నీరు లోలెవల్ కాజ్‌వే మీదుగా ఉధృతంగా ప్రవహిస్తుండడంతో భీమారం పంచాయతీ కార్యదర్శి, జీపీవోలు అక్కడే ఉండి నది వైపు ఎవరూ వెళ్లకుండా చూస్తున్నారు. కేతేపల్లి తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో శ్రీనివాసరావు భీమారం బ్రిడ్జి వద్దకు వెళ్లి పరిస్థితిని పరిశీలించారు.

అభ్యంతరాలు తొలగేలా ఆత్మీయత పెరిగేలా..

● వివాహ పూర్వ కౌన్సిలింగ్ కేంద్రాలు

(5వపేజీ తరువాయి)

వివాహ పూర్వ కౌన్సిలింగ్ కేంద్రాలు త్వరలో ఏర్పాటు కానున్నాయి.

పెరుగుతున్న అగాధం

వైవాహిక బంధానికి పరస్పర విశ్వాసం, అవగాహన, ప్రేమానురాగాలే పునాదిరాయి. కానీ అవి లోపిస్తుండటంతో పలు అనర్థాలు చోటుచేసుకుంటున్నాయి. అక్రమ సంబంధాలు, హత్యలు క్రమేపీ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఓ వైపు స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా అయితే మరోవైపు అపనమ్మకం, ఈగో, వ్యామోహాలు, నైతిక విలువలను విస్మరించడం, తాహతుకు మించిన ఆలోచనలు, ఆశలు, అన్నింటికీ మించి క్షణికావేశంతో తీసుకుంటున్న నిర్ణయాలు దంపతుల మధ్య అగాధం పెరగడానికి ప్రధాన కారణాలవుతున్నాయి.

పెరుగుతున్న ఫిర్యాదులు

పోలీస్‌స్టేషన్లలో కుటుంబ తగాదాలు, వైవాహిక బంధాలపై ఫిర్యాదులు పెరుగుతున్నాయని రికార్డులు చెబుతున్నాయి. కేవలం మహిళల, కుటుంబ సమస్యల పరిష్కారం లక్ష్యంగా ప్రభుత్వం జిల్లాకు ఒక మహిళా పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసింది. అప్పటినుంచి బాధితులు మహిళా పోలీస్‌స్టేషన్‌లో నేరుగా ఫిర్యాదు చేసుకునే అవకాశం లభించింది. ఫిర్యాదుల ఆధారంగా సఖీ, సీడీఈడబ్ల్యూ కౌన్సిలింగ్ కేంద్రా ల్లో భార్యాభర్తలకు, కుటుంబసభ్యులకు కౌన్సిలింగ్ నిర్వహించి వారి మధ్య రాజీకుదురుస్తున్నారు. కౌన్సిలింగ్ విఫలమైన పక్షంలో ఎఫ్ఐఆర్ నమోదు చేస్తుండడంతో కేసులు న్యాయస్థానం పరిధిలోకి వెళ్తున్నాయి. అక్కడ కూడా విడాకులు ఇచ్చేముందు ఇరువురికి కౌన్సిలింగ్ ఇస్తున్నారు. మనోవర్తి, నెలవారీగా జీవనభృతి చెల్లించడంలో తలెత్తుతున్న ఇబ్బందులతో విడాకులు పొందిన జంటలు తిరిగి కోర్టులను ఆశ్రయిస్తున్నారు. తల్లిదండ్రుల మధ్య ఏర్పడిన అగాధంతో పిల్లలు దిక్కులేని వారుగా మానసిక క్షోభకు గురై సామాజికభద్రత, గౌరవం కోల్పోతున్న పరిస్థితులు ఉన్నాయి.

వివాహ పూర్వ కౌన్సిలింగ్ కేంద్రాలతో సత్ఫలితాలు

కుటుంబ, వైవాహిక వ్యవస్థకు భద్రత కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం సంకల్పించిన వివాహ పూర్వ కౌన్సిలింగ్ కేంద్రాలతో సత్ఫలితాలు వస్తాయని అధికారులు భావిస్తున్నారు. వివాహం నిశ్చయమైన జంటకు వివాహం అనంతరం ఎదురయ్యే పరిస్థితులపై అవగాహన కల్పించనున్నారు. అలాగే పిల్లల అభిప్రాయాలతో నిమిత్తం లేకుండానే కుటుంబసభ్యులు వివాహాలు కుదిరిస్తున్న పరిస్థితి ప్రస్తుతం ఉంది. అయితే మనసులోని మాటలను చెప్పే అవకాశం ఇవ్వకపోవడం, ధైర్యం లేకపోవడం తదితర కారణాలతో బలవంతంగా పెద్దలు కుదిర్చిన వివాహం చేసుకున్నప్పటికీ కాపురంలో రాజీపడని పరిస్థితి ఉంటోంది. అలాగే పిల్లల ప్రేమ వివాహాలు నచ్చకపోవడంతో పరువు హత్యలు కూడా జరుగుతున్నాయి. ఈ తరహా దుస్థితి వివాహం అనంతరం తలెత్తకుండా యువతి, యువకులకు వివాహ పూర్వ కౌన్సిలింగ్ కేంద్రాల్లో కౌన్సిలింగ్ ఇచ్చి వారి అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించే అవకాశం కల్పించనున్నారు. పిల్లల మనోగతాలను తల్లిదండ్రులకు వివరించి సమస్యలను వివాహానికి ముందే పరిష్కరించే ప్రయత్నాలను వివాహపూర్వ కౌన్సిలింగ్ కేంద్రాలు చేయనున్నాయి. అయితే విధి విధినాలు ఖరారయ్యాక వీటిపై మరింత స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు.

మంచి నిర్ణయం

వివాహ పూర్వ కౌన్సిలింగ్ కేంద్రాల ఏర్పాటు నిర్ణయం మంచిది. క్షణికావేశం, పరస్పర అపనమ్మకం, ఇష్టంలేని వివాహాలు, తల్లిదండ్రుల, కుటుంబసభ్యుల మితిమీరిన జోక్యం దంపతుల మధ్య విభేదాలు పెరగడానికి కారణాలవుతున్నాయి. మాకు వస్తున్న ఫిర్యాదుల్లో అధికం ఇవే ఉంటున్నాయి. ఫిర్యాదుల ఆధారంగా కౌన్సిలింగ్ చేసి జంటలను కలిపేందుకు ప్రయత్నిస్తున్నాం. వివాహానికి ముందే అభిప్రాయాలు, వివాహ అనంతరం నెలకొనే పరిస్థితులు వివరించగలిగితే సత్ఫలితాలు వస్తాయి.

● ఏ. అర్జునయ్య, యాదాద్రి మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ

కుటుంబసభ్యుల జోక్యం తగ్గితే కాపురాలు సాఫీగా

కుటుంబసభ్యుల మితిమీరిన జోక్యం తగ్గితే దంపతుల మధ్య విభేదాలు కూడా తగ్గుతాయి. పలు కారణాలతో విడాకుల కోసం పోలీస్‌స్టేషన్‌లను, కోర్టులను ఆశ్రయిస్తున్న జంటలు పెరుగుతున్నాయి. కౌన్సిలింగ్ ద్వారా పలు జంటలు విభేదాలను విస్మరించి తిరిగి ఏకం అవుతున్నాయి. వివాహ పూర్వ కౌన్సిలింగ్ కేంద్రాల ద్వారా పరిష్కరించుకోవాలి.

● డాక్టర్ ప్రమీల, భువనగిరి సఖి ఫ్యామిలీ కౌన్సిలింగ్ కేంద్రం

చుట్టూ జలం.. విద్యార్థుల్లో భయం

● వర్షం వచ్చినప్పుడు పాఠశాల ఆవరణ జలమయం ● కొమ్మేపల్లి ఎస్టీ గురుకుల పాఠశాలకు ప్రహరీ కరువు ● వర్షపునీరు, క్రిమికీటకాలు వస్తుండడంతో విద్యార్థుల ఆందోళన



ఎస్టీ గురుకుల పాఠశాల ఆవరణ చుట్టూ చేరిన వర్షపు నీరు(ఫైల్)

దేవరకొండ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం కొమ్మేపల్లి గ్రామ శివారులో పొలాల మధ్య 2022 సంవత్సరంలో గిరిజన గురుకుల బాలుర పాఠశాల నిర్మించారు. ప్రహరీ నిర్మించకపోవడం, దిగువ భాగాన ఉండడంతో వర్షా లు వచ్చినప్పుడు పాఠశాల ఆవరణలోకి వర్షపునీరు చేరుతోంది. దీనికి తోడు కీటకాలు వస్తుండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. మొత్తం 640మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. గతంలో అనేకసార్లు విద్యార్థులు, అధ్యాపకులు, ప్రిన్సిపాల్ కలెక్టర్ తోపాటు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధి కారుల దృష్టికి తీసు కెళ్లినా ప్రహరీ నిర్మించలేదు. మంగ ళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతంలో ఉన్న పాఠశాల ఆవరణను వర్షపు నీరు చుట్టుముట్టింది. ఉదయం లేచిన విద్యార్థులకు పాఠశాల ఆవరణ చుట్టూ వర్షపు నీటిని చూసిన విద్యార్థులు ఆందోళనకు గుర య్యారు. దీంతో వెంటనే స్పందించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చం ద్రపవార్, ఆర్‌సీవో బలరాంనాయక్, ఏఎస్పీ మౌనిక, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో రమ ణారెడ్డి ఇతర అధికారులు హుటాహుటిన పాఠశాల వద్దకు చేరుకున్నారు. పాఠశాలలో ఉన్న విద్యార్థులను తాళ్ల సాయంతో బయటికి తీసుకొచ్చారు. వారిని వాహనాల్లో బీసీ, మైనార్టీ గురు కుల పాఠశాలలకు తరలించారు. పాఠశాల చుట్టూ భారీగా వరద నీరు చేరడంతో పాఠశాలకు మూడు రోజులు సెలవులు ప్రకటించారు. అధికారుల అనుమతితో కొందరు విద్యార్థులను తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకెళ్లారు.



విద్యార్థులను పాఠశాలను నుంచి బయటికి తెస్తున్న పోలీసులు(ఫైల్)

పాఠశాలకు ప్రహరీ నిర్మిస్తాం : ఎమ్మెల్యే బాలునాయక్



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

దేవరకొండ మండలం కొమ్మేపల్లి ఎస్టీ గురుకుల పాఠశాలకు ప్రహరీ నిర్మిస్తామని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. ఆర్డీవో రమణారెడ్డి, అధికారులతో కలిసి కొమ్మెపల్లి గురు కుల పాఠశాలను గురు వారం పరిశీలించారు. ముంపు కారణంగా గురుకుల పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొ న్నారని, వారికి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. కార్యక్రమంలో దేవరకొండ మార్కెట్ చైర్మన్ జము నమాధవరెడ్డి, మాజీ చైర్మన్ ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంఈవో మాతృనాయక్, ఎంపీడీవో డానియెల్ ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మునుగోడు రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊకొండి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మేడి చంద్రస్వామి గత కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతూ హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న టీఆర్ఎస్ నాయకులు పొలగోని సైదులు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి తన వంతుగా రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట గుర్రాల సురేష్, యర్రమాద రత్నం, దెండే నరసింహ, సునీల్, సాయిలు ఉన్నారు.

ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులను ఆదుకుంటాం

నకిరేకల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో నకిరేకల్ నియోజకవర్గంలో నష్టపోయిన చేనేత కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ధైద రవీందర్ అన్నారు. నకిరేకల్ మూసీరోడ్డులోని పద్మశాలీ కాలనీలో మొంథా తుఫాన్‌తో చేనేత కార్మికుల హ్యాండ్‌లూం మగ్గాల గుంతలోకి వరద నీరు చేరింది. గురువారం హ్యాండ్‌లూంలను ఆయన పరిశీలించారు. చేనేత కార్మికులకు తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు.

మొండి బకాయిలపై నజర్

- బకాయిలుదారులకు రెడ్ నోటీసులు!
- వారం రోజుల్లోగా స్పందించకపోతే ఆస్తులు సీజ్
- 4 బృందాలతో వారం రోజులుగా పంపిణీకి సిద్ధం
- ప్రత్యేక కార్యాచరణ రూపొందించిన మునిసిపల్ యంత్రాంగం
- పాత బకాయిలు రూ.33కోట్లకుపై మాటే

రామగిరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ మునిసిపాలిటీ ఆస్తి పన్ను బకాయిల వసూళ్లపై మునిసిపల్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. మునిసిపాలిటీ పరిధిలోని 48 వార్డుల్లో సుమారు 45 వేల వాణిజ్య, నివాస భవనాలు ఉన్నాయి. వీటన్నింటికి ఏడాది ఆస్తి పన్ను డిమాండ్ రూ.18.30 కోట్లు ఉంది. అయితే ఈ ఏడాదికి సంబంధించి ఇప్పటి వరకు రూ.9 కోట్లు వసూలు కాగా, ఇంకా రూ.9.30 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఇకపోతే పాత బకాయిలు, రూ.33.80 కోట్లు ఉన్నాయి. మొత్తంగా రూ.43.11కోట్లు ఆస్తి పన్ను బకాయిలు పేరుకుపోయాయి. అయితే వీటిని వసూలు చేయడం లక్ష్యంగా మునిసిపల్ యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది.


రెడ్ నోటీసులు జారీ చేసేందుకు సన్నద్ధమవుతున్న మునిసిపల్ సిబ్బంది

మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు

నీలగిరిలో భవనాల యజమానులు కొందరు ఆస్తి పన్ను సక్రమంగా చెల్లించకుండా మొండికేస్తున్నారు. ఒక్కో భవనానికి కొందరు రూ.లక్షల్లో బకాయిలు పడ్డారు. దాంతో బకాయిలు పెద్ద ఎత్తున పేరుకుపోయాయి. బకాయిదారుల నుంచి వసూలు చేసేందుకు మునిసిపల్ యంత్రాంగం టాప్ 1000 బకాయిదారులను గుర్తించింది. వీరికి వారం రోజుల్లోగా రెడ్ నోటీసులు అందజేయనున్నారు. అయితే గుర్తించిన బకాయిదారుల నుంచి రూ.16 కోట్లకు పైగా ఆస్తి పన్ను వసూలయ్యే అవకాశం ఉంది.

వసూళ్లకు రాజకీయ పైరవీల గండం

పట్టణంలో కొంతమంది బకాయిదారులు వారికి ఉన్న రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ఆస్తి పన్ను దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారు. మునిసిపల్ యంత్రాంగం ఆస్తి పన్నుకు వసూలుకు వెళితే రాజకీయ నాయకులతో అధికారులకు ఫోన్ చేయించి ఆస్తి పన్ను చెల్లించకుండా జాప్యం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అయితే ఈసారి రాజకీయ నాయకుల పైరవీలకు తావు లేకుండా ఆస్తి పన్ను కచ్చితంగా వసూలు చేసి తీరుతామని అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు మునిసిపల్ యంత్రాంగం టాప్ 1000 బకాయిదారుల జాబితాలు తయారు చేసి వారికి రెడ్ నోటీసులు అందజేసేందుకు సిద్ధమయ్యారు. .

ఆస్తుల జప్తులకు ప్రణాళికలు

రెడ్ నోటీసుల జారీ తర్వాత కూడా బకాయి పన్ను చెల్లించకుంటే, ఆయా గృహాలకు సంబంధించిన నల్లా కలెక్షన్ తొలగించడంతో పాటు అవసరమైతే ఆస్తులను కూడా జప్తు చేయాలని మునిసిపల్ యంత్రాంగం భావిస్తోంది. ప్రత్యేకాధికారి పాలనకావడంతో రాజకీయ నాయకుల ఫోన్లను పట్టించుకునే అవకాశం తక్కువగానే ఉంటుంది. బకాయిలపై ఫోకస్ పెడితే 90 శాతం వరకు వసూలయ్యే అవకాశం ఉంటుంది.

బకాయలు చెల్లించకపోతే ఆస్తులు జప్తు చేస్తాం



పాత బకాయిలు ఎక్కువగా ఉండి చెల్లించని టాప్ వెయ్యి మందిని గుర్తించడం జరిగింది. వారికి రేపటి నుంచే రెడ్ నోటీసులు జారీ చేస్తున్నాం. పన్ను బకాయిలు వెంటనే చెల్లించి మునిసిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి. పన్ను చెల్లించని బకాయిదారుల ఆస్తులను చట్ట ప్రకారం జప్తు చేస్తాం.

- సయ్యద్ ముసబ్ అహ్మద్, మునిసిపల్ కమిషనర్

పరవళ్లు తొక్కుతున్న మూసీ


మానాయికుంట గ్రామాల మధ్య ప్రవహిస్తున్న మూసీ నది

శాలిగౌరారం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో కురిసిన వర్షాలకు, మూసీ నది ఎగువ ప్రాంతాల్లో వరద నీరు భారీగా వస్తుంది. దీంతో శాలిగౌరారం మండలం గురజాల, యాద్రాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం మానాయికుంట గ్రామాల మధ్య మూసీ నది బ్రిడ్జి వద్ద మూసీ పరవళ్లు తొక్కుతుంది. మూసీ నది పరవళ్లు చూపరులను కనువిందు చేస్తుంది. పది అడుగుల లోతు నుంచి మూసీ ఉధృతంగా ప్రవహిస్తోంది. హైదరాబాద్‌లో కురిసిన వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి వరద ఉగ్రరూపం దాల్చింది. మండలంలోని ఉప్పలంచ, మనిమద్దె, గురజాల తుడిమిడి, చిత్తలూరు, వంగమర్తి గ్రామాల సరిహద్దులో మూసీ నది ఉధృతంగా ప్రవహించడం వల్ల నది తీర ప్రాంతంలో సాగు చేసిన వరి పంట అక్కడ అక్కడ నీట మునిగింది. ఇక్కడ ప్రవహిస్తున్న నీరు మూసీ ప్రాజెక్టులోకి వెళ్తుంది.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

శాలిగౌరారం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భారీగా కురిసిన వర్షాలకు పంట నష్ట పోయిన రై తులకు ప్రభు త్వం వెంటనే న ష్టపరిహారం చె ల్లించాలని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు జమ్ము రమేష్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు ఐకేపీ సెంటర్లలో పోసిన ధా న్యం తడిసి ముద్దయిందని అన్నారు. రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని కోరారు. సీసీఐ కేంద్రంలో కూడా పత్తి కొనుగోలు నిలిపివేస్తున్నామని ప్రకటించారని, ప్రభుత్వం వెంటనే స్పందిం చి సీసీఐ కేంద్రాల ద్వారా తక్షణమే పత్తిని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు బోడ రాజు, అయితగోని గణేష్, యామగాని వీరేందర్, రాచమల్ల శ్రీనివాస్, కుక్కడపు సందీప్, దేవరకొండ అల్లయ్య, రెబ్బ ఉమేష్, యాదగిరి పాల్గొన్నారు.

కాలేజీలో సమస్యలను పరిష్కరించాలి

నార్కట్‌పల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ మండల నాయకులు డిమాండ్ చేశారు. నల్లగొండలోని జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారికి గురువారం వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కాలేజీలో ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ బోధన సిబ్బంది లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, మరికొన్ని నెలల్లోనే పరీక్షలు నిర్వహించనుండగా సిలబస్ వెంటనే పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా తరగతి గదులు, మౌలిక వసతుల లేమితో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఏబీవీపీ నార్కట్‌పల్లి పట్టణ శాఖ కార్యదర్శి పాలకూరి శివ, నాయకులు సిల్వేరు శివ, అవిరేణి కార్తీక్, మహేశ్ తదితరులు ఉన్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


వరి పంటను పరిశీలిస్తున్న ఏవో పురుషోత్తం

కేతేపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ధాటికి దెబ్బతిన్న వ రి, పత్తి పంటల్లో రైతులు సస్యరక్షణతో నష్టనివారణ చర్యలు తీసుకోవాలని కేతేపల్లి మండల వ్యవసాయ అధికారి బొక్క పురుషోత్తం సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం ఆయన తన సిబ్బందితో పర్యటించారు. వ ర్షానికి దెబ్బతిన్న వరి, పత్తి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండల వ్యాప్తంగా 1950 ఎకరాల్లో వరి, 200ఎకరాల్లో పత్తి పంట మొంథా తుఫానుతో దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటలో వర్షపు నీరు నిలిచి ఉండటం వల్ల పంట నేలవాలిందన్నారు. వర్షాలు తగ్గినందున తక్షణమే రైతులు వరి పొలాల్లోని నీటినంతా బయట కు వెళ్లేలా చూడాలన్నారు. నీరు తొలగించిన తర్వాత నేల వాలిన వరి పైరును నిలబెట్టి కట్టలు కట్టి ఆరేలా చేయడం వల్ల వరి గింజలు రంగుమారకుండా ఉంటాయన్నారు. ఇక కోతకు ఇంకా సమయం ఉన్న వరి పంటలో తెగుళ్ల నివారణకు లీటరు నీటికి 1గ్రాము చొప్పున కార్బండైజం కలిపి పంటపై పిచికారీ చేయాలని సూచించారు. కోత కోసిన ధాన్యం మొలకెత్తకుండా ఉండేందుకు లీటరు నీటికి 50 గ్రాముల చొప్పున కళ్ల ఉప్పు కలిపిన ద్రావణానికి ధాన్యంపై పిచికారీ చేయాలన్నారు. వర్షానికి తడిసిన పత్తిని ఇప్పటికిప్పుడు తీయవద్దని సూచించారు. వర్షం పూర్తిగా తగ్గిపోయి పత్తిలో తేమలేకుండా ఆరిన తర్వాత మాత్రమే పత్తి తీయాలన్నారు. ఏవో వెంట ఏఈవోలు జి.బాలరాజు, ఉమేష్, నాగరాజు ఉన్నారు.

మునుగోడు రూరల్: మునుగోడు మండలంలోని సింగారం గ్రామంలో తుఫానుకు దెబ్బతిన్న పంట పొలాలను మునుగోడు ఏడీఏ వేణుగోపాల్, వ్యవసాయాధికారిని ఎస్ పద్మజ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు పోసుకున్న కుప్పలను తడవకుండా టార్పాలిన్ పట్టాలతో జాగ్రత్తగా కాపాడుకోవాలని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మాదగోని నరసింహ, రావుల మల్లేష్, వెంకట్‌రెడ్డి, రామస్వామి, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

కేతేపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయాలని తహసీల్దార్ రమాదేవి అన్నారు. మండలంలోని భీమారం గ్రామంలో గల ఐకేపీ కేంద్రాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు కేంద్రానికి వచ్చిన ధాన్యం నిల్వలు, కొనుగోళ్ల వివరాలు ఉన్న రికార్డులను పరిశీలించారు. కేంద్రంలోని రైతుల ధాన్యం రాశులను ఆమె పరిశీలించి తేమశాతం తగ్గేందుకు ఆరబెట్టాలని సూచించారు. ఆమె వెంట ఆర్ఐ వెంకన్న, కాంగ్రెస్ నాయకుడు నరేందర్, కేంద్రం నిర్వాహకులు ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి


ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాగార్జున

నల్లగొండరూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ వర్షాలకు తడిసిన, మొలకెత్తిన, రంగు మారిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం బేషరుతుగా కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. మండలంలోని కొత్తపల్లి గ్రామపరిధిలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. వర్షాల కారణంగా ఐకేపీలకు ధాన్యం తీసుకువచ్చిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఒక్క లారీకి 4 నుంచి 13 క్వింటాళ్ల ధాన్యాన్ని కట్ చేయడం అన్యాయమని అన్నారు. ధాన్యాన్ని తీసుకోవడంలో మిల్లర్లు నిర్లక్ష్యం చేస్తున్నారని, వారిపై జిల్లా యంత్రాంగం పర్యవేక్షణ లోపించిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు కొండ అనురాధ, మండల కార్యదర్శి సైదులు, వెంకన్న, రవీందర్, అంజయ్య, శ్రీను, వెంకన్న పాల్గొన్నారు.

నిండా ముంచిన మొంథా తుఫాన్

- నేలకొరిగిన వరి
- పంట చేలను పరిశీలించిన అధికారులు

చిట్యాలరూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను రైతులను నిండా ముంచింది. పంటలు చేతికి వచ్చి ధాన్యం విక్రయించే సమయంలో వర్షం నిండా ముంచిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంటనష్టాన్ని అంచనా వేసేందుకు మండల వ్యవసాయ అధికారి పగిడిమర్రి గిరిబాబు, ఏఈవోలు కృష్ణకుమారి, వీణాకుమారి, వాసుదేవ్, మనీషా, శశాంక గ్రామాల్లో పర్యటించి పంటచేలను పరిశీలించారు. పం టనష్టం జరిగిన రైతుల వివరాలను నమోదు చేసుకున్నారు. మండల వ్యాప్తంగా ప్రాథమిక పరిశీలనలో సుమారు 240 ఎకరాల వరి, 120 ఎకరాల పత్తిచేలు దెబ్బతిన్నాయని అధికారులు అంచనా వేశారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు చెప్పారు.

ముష్టిపల్లిలో కూలిన దివ్యాంగుడి ఇల్లు

● నాంపల్లి : మండలం ముష్టిపల్లిలో దివ్యాంగుడి పూరిల్లు కూలిపోయి ంది మొగుదాల ఎల్లయ్య ఇల్లు మట్టిగోడలు పూర్తిగా నానిపోవడం తో ఇల్లు కూలిపోయింది. ఎల్లయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

● నకిరేకల్ : మండలంలో 10 కొనుగోలు కేంద్రాల్లో 15 రోజుల క్రితం ధా న్యం పోసిన రైతులు కాంటావేయకపోవడంతో ధాన్యం తడిసింది. అలాగే పత్తి సీసీఐ కేంద్రం ఇప్పటివరకు ప్రారంభించకపోవడంతో పత్తి రైతులు దళారులకు అమ్ముకునే పరిస్థితి నెలకొంది. మండలంలోని నష్టపోయిన రైతుల వరి పొలాలను ఏడీఏ జానిమియా, అధికారులు పరిశీలించారు. నేలకొరిగిన వరిచేలును గింజలు మొలకెత్తకుండా జడలు కట్టాలని, తేమశాతం ఎక్కువగా ఉంటేనే 5శాతం ఉప్పుద్రావణం లీటర్ నీటిలో 50 గ్రాముల కళ్లఉప్పు పొలంపై పిచికారీ చేయడం వల్ల గింజ మొలకెత్తకుండా రంగు మారకుండా ఉంటుందని ఆయన రైతులకు అవగాహన కల్పించారు. పత్తి చేనులో నీరు నిల్వకుండా చూసుకుని కాల్వలు ఏర్పాటు చేసుకుని నీటిని బయటకు పంపాలని రైతులకు సూచనలిచ్చారు.


నార్కట్‌పల్లి : నక్కలపల్లి ఐకేపీ కేంద్రంలోకి చేరిన వరద నీరు

● నార్కట్‌పల్లి : మండలంలోని నక్కలపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చిన వరద రైతుల ధాన్యం కుప్పలను నీటి ముంచింది. దీంతో రైతులు ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా మరో చోటికి తరలించేందుకు వ్యయప్రయాస పడాల్సి వచ్చింది. తొండ్లాయి, అక్కెనపల్లి, పల్లెపహాడ్ గ్రామాల్లో వరి ధాన్యం వానలకు తడిసింది. టార్పలిన్లు కప్పినా వచ్చిన వరదతో ధాన్యం నీట మునిగింది. దీంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. కాగా తడిసిన ధాన్యాన్ని తేమశాతంతో నిమిత్తం లేకుండా కొనుగోలు చేసి ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు నక్కలపల్లి మాజీ వార్డుసభ్యుడు బాషపాక రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


చిట్యాల : పెద్దకాపర్తిలో నేలకొరిగిన వరిచేనును చూసుకుంటున్న రైతులు

జాలకుంట ప్రవాహ ఉధృతిని పరిశీలన

వరద నీరు ప్రవహిస్తున్న రోడ్లను తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు గురువారం ఉదయం పరిశీలించారు. ముఖ్యంగా మండలంలోని అమ్మనబోలు నుంచి రామాంజపురం గ్రామానికి వెళ్లే రోడ్డుపై జాలకుంట వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తూ రాకపోకలకు అంతరాయం కల్గించగా పరిస్థితిని ఆయన స్వయంగా పరిశీలించి తగు సూచనలు చేశారు. నార్కట్‌పల్లి మండలంలోని బీ.వెల్లెంల, అమ్మనబోలులో ఒకటి చొప్పున, నెమ్మానిలో 2 చొప్పున మట్టి ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు రెవెన్యూ సిబ్బంది గుర్తించారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ తరుణ్, కార్యదర్శి ఎలేందర్‌రెడ్డి ఉన్నారు.


నకిరేకల్ : నోములలో నేలకొరిగిన పొలాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ జానిమియా

శిశువిక్రయాలు, అక్రమంగా దత్తత తీసుకుంటే చర్యలు


కోటయ్యగూడెంలో గర్భిణితో మాట్లాడుతున్న సీడీపీవో లావణ్యకుమారి

చండూరు రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఎవరైనా శిశువులను విక్రయించినా, అక్రమంగా దత్తతకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని సీడీపీవో లావణ్యకుమారి అన్నారు. మండలంలోని కోటయ్యగూడెం గర్భిణుల ఇంటికి వెళ్లి వారికి తగు సూచనలు చేశారు. ముఖ్యంగా మూడవ కాన్పు కోసం ఎదురు చూస్తున్నవారి వారికి ప్రత్యేకంగా శిశు విక్రయాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ, అంగన్‌వాడీ టీచర్ సునీత, బాలింతలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

శిశువులను విక్రయించడం నేరం

కనగల్: శిశువులను విక్రయించడం చట్టరీత్యా నేరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. మండలంలోని రేగట్టె గ్రామ అంగన్‌వాడీ 1, 2వ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు గురువారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా బాల్యవివాహాలు, అక్రమదత్తత, శిశువిక్రయాలు, లింగవివక్ష తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాణి, అరుణ, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: శిశు విక్రయాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ ఏసీడీపీవో వెంకటమ్మ అన్నారు. చిట్యాలలోని నాలుగో అంగన్‌వాడీ సెంటర్‌లో శిశు విక్రయాలు, లింగ వివక్షతపై జరిగిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. అక్రమంగా దత్తత ఇవ్వకూడదనీ, అలా చేసిన వారిపై, తీసుకున్న వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. లింగవివక్ష చూపరాదని, లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, అంగన్‌వాడీ టీచర్ మమత పాల్గొన్నారు.


చిట్యాల అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న ఏసీడీపీవో వెంకటమ్మ

మొంథా.. నష్టం కొండంత

(5వ పేజీ తరువాయి)

వరి, 1350 ఎకరాల్లో పత్తి దెబ్బతినగా, నకిరేకల్ నియోజకవర్గంలోని 37 గ్రామాల్లో 4,410 ఎకరాల్లో వరి, 2,721 ఎకరాల్లో పత్తి దెబ్బతినగా నల్లగొండ నియోజకవర్గంలో 19 గ్రామాల్లో 1,239 ఎకరాల్లో వరి, 139 ఎకరాల్లో పత్తి పంటకు నష్టం జరిగింది. ఈమేరకు వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కలెక్టర్ ఇలాత్రిపాఠికి నివేదిక అందజేయగా కలెక్టర్ ప్రభుత్వానికి నివేదికను పంపించారు.

ప్రాథమిక అంచనా పూర్తి చేశాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వర్షాలతో నష్టపోయిన పంటలకు సంబంధించి ప్రాథమిక అంచనాను పూర్తి చేశాం. నివేదికను కలెక్టర్‌కు అందజేశాం. కలెక్టర్ ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తారు. క్షేత్ర స్థాయిలో పంట నష్టం అంచనాను వ్యవసాయ అధికార యంత్రాంగం త్వరగా పూర్తి చేయడంతో పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికను రూపొందించాం.

- పి.శ్రవణ్ కుమార్, జేడీఏ నల్లగొండ

జిల్లాలో నియోజకవర్గాల వారీగా పంట నష్టం వివరాలు...

నియోజకవర్గం	వరి	పత్తి	మిర్చి	మొత్తం
నాగార్జునసాగర్	14004	2814	30	16848
దేవరకొండ	4665	18830	25	23520
మిర్యాలగూడ	10244	65	50	10359
మునుగోడు	925	1350	---	2275
నకిరేకల్	4410	2721	----	7131
నల్లగొండ	1239	139	----	1378
మొత్తం	35487	25919	105	61511

ఇలా వెళ్లి.. అలా వచ్చారు

(5వ పేజీ తరువాయి)

సంబంధించి డబ్బుల కలెక్షన్ మితిమీరిపోతుంది. చిట్టి ఎత్తిన వారికి సంబంధించిన ప్రతీ ఫైల్‌ను ఆ చిట్‌ఫండ్ యజమానులు పూర్తిగా తయారు చేసుకొని వచ్చి అధికారుల దగ్గరకు వచ్చే సరికి రూ.1000 నుంచి రూ.3వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇక చిట్‌ఫండ్‌లలో గొడవలకు సంబంధించి ఉంటే ముడుపులు భారీగా ఉంటున్నట్లు సమాచారం. సాధారణ సొసైటీల ఫైల్‌లకు సంబంధించి రూ.1500 నుంచి రూ.2500, ఫ్రాంకింగ్ మిషన్‌లకు సంబంధించి రూ.2వేల వరకు వసూలు చేస్తుండగా, రెన్యూవల్‌కు వచ్చే సరి కి భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం.

దీపాల అంకరణలో.. దేదీప్యమానంగా అమ్మవారు


కార్తీక దీపాల వెలుగుల్లో అమ్మవారు

కనగల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కనగల్ మండలం దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో కార్తీకమాసం ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. గురువారం సాయంత్రం కార్తీకదీపాల వెలుగులో అమ్మవారు దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకున్న భక్తజనం పరవశించిపోయారు. అంతకుముందు ఆలయ ముఖ్య అర్చకులు మల్లాచారి, శ్రవణ్ చార్యుల ఆధ్వర్యంలో అర్చక బృదం అమ్మవారికి విశేషలంకరణ చేశారు. ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.


నకిరేకల్‌లో ఎస్ఎఫ్ఐ బంద్ విజయవంతం

నకిరేకల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ముస్కు రవీందర్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం నకిరేకల్ పట్టణంలో విద్యాసంస్థలు బంద్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకుండా పేద, మధ్యతరగతి విద్యార్థులను విద్యకు దూరం చేసే పరిస్థితిలో ఉందన్నారు. ప్రైవేట్ కళాశాలలో కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ప్రైవేట్ యాజమాన్యం విద్యార్థులను తీవ్రమైన ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు విష్ణుసాయి, శివ, అరుణ్, విక్రాంత్ పాల్గొన్నారు.

ఐకేపీ కేంద్రాల్లో మొలకెత్తిన ధాన్యం



కనగల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వరుసగా కురుస్తున్న వర్షాలు రైతులను కష్టాల్లో ముంచాయి. వివిధ గ్రామాల్లోని ఐకేపీ కేంద్రాల్లోకి వర్షం నీరు చేరి ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. దీంతో పలువురు రైతుల ధాన్యం మొలకెత్తింది. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు ఐకేపీ కేంద్రాల్లో స్థలం సరిపోక ఏంచేయాలో దిక్కు తోచని స్థితిలో రైతులు ఉన్నారు. చర్లగౌరారం ఐకేపీ కేంద్రంలో తడిసిన ధాన్యం, మరోపక్క కొనుగోళ్లు రెండు మూడు రోజులుగా నిలిచిపోయి ఆయా కేంద్రాల్లో ధాన్యం రాశులు పేరుకుపోయాయి. తేమతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేయాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు.



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	590 (312.0450)	1,46,733	1,46,733 14 గేట్ల ఎత్తివేత
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643. (4.11)	45,042.61	47,827.66
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	171.618 (40.6787)	84,370	98,285 4 గేట్ల ఎత్తివేత

చికెన్ ధరలు | లైవ్ : రూ.149 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260



అభ్యంతరాలు తొలగేలా ఆత్మీయత పెరిగేలా

వివాహ పూర్వ కౌన్సెలింగ్ కేంద్రాలు

- దంపతులు కానున్న యువ జంటల్లో అంతరాలు తొలగించేందుకు త్వరలో ఏర్పాటు

దీర్ఘ సుమంగళీ భవ! అంటూ పెద్దలు దీవించిన పెళ్లిళ్లు.. ఒకరినొకరు ఇష్టపడి, ప్రేమించి చేసుకున్న జంటలు చిన్న చిన్న మనస్పర్థలతో చివరిదాకా కొనసాగడం లేదు. అన్యోన్యంగా సాగాల్సిన వివాహ బంధం పలు కారణాలతో తెగుతోంది. వీటికి చెక్ పెట్టేందుకు వివాహ పూర్వ కౌన్సిలింగ్ కేంద్రాలను త్వరలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఏర్పాటు చేయనున్నారు.

- (ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

పరస్పర అనుమానాలు, లోపిస్తున్న నైతిక విలువలు, అభిప్రాయ భేదాలు, అంతకుమించి కుటుంబసభ్యుల మితిమీరిన జోక్యం, తదితర కారణాలతో భార్యాభర్తల మధ్య సఖ్యత లోపించి న్యాయం కావాలంటూ పోలీస్‌స్టేషన్లను ఆశ్రయిస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఈ దైన్య స్థితి యువ జంటలతోపాటు పిల్లలున్న భార్యాభర్తల మధ్య కూడా ఉంది. దీంతో పోలీస్‌స్టేషన్లు, సఖికేంద్రాలు, సీడీఈడబ్ల్యూలలో కౌన్సిలింగ్ ఉదంతాలు పెరగుతున్నాయి. ఈ వైఖరి అంతిమంగా కుటుంబవ్యవస్థపై ప్రభావం చూపుతోంది. దీనికి దంపతుల మధ్య అవగాహన లోపమే ప్రధాన కారణమని వ్యక్తిత్వ వికాస, మానసిక నిపుణులు, అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో దంపతులు కాబోతున్న యువ జంటలకు వైవాహిక జీవితం, పరిస్థితులు, సమస్యల ను అధిగమించడం, ఎదుర్కోవడం తదితర అంశాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ వివాహ పూర్వ కౌ న్సిలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంకల్పించింది. ఈమేరకు ఇటీవలే ఆ శాఖ మంత్రి సీతక్క ఉత్తర్వులు జారీ చేశారు. విధివిధానాలు ఖరారు కాగానే ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో....

- మిగతా 7వ పేజీలో...



కనగల్ మండలం చెన్నారంలో తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు

మొంథా.. నష్టం కొండంత

- భారీ వర్షాలకు రైతులు అతలాకుతలం
- జిల్లాలో 61,511 ఎకరాలల్లో పంట నష్టం
- ప్రాథమిక అంచనాను రూపొందించిన వ్యవసాయ శాఖ

మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో భారీగానే పంట నష్టం జరిగింది. చేతికొచ్చిన పంట నేలవాలడంతో రైతులు అతలాకుతలమయ్యారు. వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా ప్రకారం 61,511 ఎకరాల్లో పంట మునిగినట్లు చెబుతున్నా, అనధికారికంగా ఆ సంఖ్య ఎక్కువగానే ఉన్నట్లు తెలుస్తోంది. వరి, పత్తి పొలాల్లో చేరిన నీటితో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

జిల్లాలో కురుస్తున్న వర్షాలకు 61,511 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు జిల్లా వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనాను రూపొందించింది.గతంలో కురిసిన వర్షాలకుతోడు మొంథా తుఫాన్ ప్రభావంతో ఈ పంటనష్టం వాటిల్లింది. మొత్తంగా చూస్తే జిల్లాలోని 310గ్రామాల్లో 30,359మంది రైతులకు సంబంధించిన పంటలు దెబ్బతిన్నాయి.ఇందులో 35,487 ఎకరాల్లో వరి,25,911 ఎకరాల్లో పత్తి, 105ఎకరాల్లో మిరప పంట నష్టం జరిగింది.

నియోజకవర్గాల వారీగా..

నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే నాగార్జునసాగర్ నియోజకవర్గంలో 80 గ్రామాల్లో 14,004 ఎకరాల్లో వరి, 2014 ఎకరాల్లో పత్తి, 30 ఎకరాల్లో మిరప పంటలకు నష్టం వాటిల్లింది. దేవరకొండ నియోజకవర్గంలో 92 గ్రామాల్లో 4,665 ఎకరాల్లో వరి, 18,830 ఎకరాల్లో పత్తిపంట, 25 ఎకరాల్లో మిరప దెబ్బతిన్నది. మిర్యాలగూడ నియోజకవర్గపరిధిలో 66 గ్రామాల్లో 10,244 ఎకరాల్లో వరి, 65 ఎకరాల్లో పత్తి, 50 ఎకరాల్లో మిరప పంటకు నష్టం వాటిల్లింది. మునుగోడు నియోజకవర్గంలో 16 గ్రామాల్లో 925 ఎకరాల్లో ...


- మిగతా 8వ పేజీలో...

33శాతం పంట దెబ్బతింటేనే నష్టపరిహారం

ప్రభుత్వ నిబంధనల మేరకు 33శాతానికి పైగా దెబ్బతింటనే నష్ట పరిహారాన్ని అందిస్తారు. ప్రాథమిక అంచనా ప్రకారం 61,511 ఎకరాలు పంట నష్టం వాటిల్లింది. ఈ వారంలో మరోసారి క్షేత్రస్థాయిలో విస్తృతంగా సర్వేచేస్తారు. పంట రికవరీ అయితే నష్ట పరిహారాన్ని అందించే అవకాశాలు తక్కువగా ఉంటాయి. అంటే 33శాతం పంట దెబ్బతిన్నట్లయితే ప్రతీ రైతుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నష్ట పరిహారం అందుతుంది. ఈ వారంలో నీరు భూమిలో ఇంకిపోయి పత్తితో పాటు వరిపంట రికవరీ అయినట్లయితే ఆ నష్టం ఏ మేరకు ఉంది, రైతు ఎంత మేరకు నష్టపోయాడనేది ప్రభుత్వం గుర్తించనుంది. జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారులు వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే వేగవంతంగా పంటనష్టాన్ని ప్రాథమిక అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించారు. దీంతో పంటనష్టపోయిన రైతులకు త్వరగా పరిహారం అందే అవకాశాలు కూడా స్పష్టంగా ఉన్నాయి. ఈ సంవత్సరం వానాకాలంలో జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు తెలుస్తోంది. ప్రకృతి వైపరీత్యాలతో కోలుకోలేని దెబ్బతిన్నారు. పత్తి, వరి పంటలు చేతికి రాకుండా పోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

తడిసి ముద్దయిన ధాన్యం

ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. అకాలవర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. 24 పీఏసీఎస్, 36ఐకేపీ కేంద్రాల్లో 4,600 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసిపోయినట్లు పౌరసరఫరాల సంస్థతోపాటు ఆ శాఖ అధికారులు లెక్కలు తేల్చారు. దాదాపు 180 వరి కుప్పలు తడిసిపోయాయి. చాలాచోట్ల వర్షాలకు ధాన్యం మొలకెత్తింది. ధాన్యం మొలకెత్తడంతో రైతులకు నష్టంవాటిల్లింది. ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో లేకపోవడం, కేంద్రాలు సైతం ఎక్కడపడితే అక్కడ గుంటలలో ఏర్పాటు చేయడంతో ధాన్యం రాశులు నీటిలో మునిగిపోయాయి. కనగల్ మండలం తేలకంటిగూడెం గ్రామంలో ధాన్యం కుప్పలు మొలకెత్తి పోయాయి. వాస్తవానికి ఐకేపీ కేంద్రాల్లో ఏర్పాట్లను సక్రమంగా చేయకపోవడంతోనే ఈ నష్ట వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. రైతులకు పొలాల వద్ద కల్లాలు లేకపోవడంతో పంట కోసిన వెంటనే ధాన్యాన్ని ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాలకు తెచ్చి ఆరబెట్టుకునే ప్రయత్నం చేశారు. అకాల వర్షాలు రైతులను నిండా ముంచాయని చెప్పవచ్చు.



కనగల్ మండలం తేలకంటిగూడెంలో మొలకెత్తిన ధాన్యం

శాంతి, భద్రతల పరిరక్షణకు నిరంతర కృషి

● ఎస్పీ శరత్ చంద్రపవార్



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ శరత్ చంద్రపవార్, పోలీస్ సిబ్బంది

నల్లగొండ క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శాంతి, భద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని ఎస్పీ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సైకిల్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ప్రతీ సంవత్సరం ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా అమరులైన వారి ఆత్మకు శాంతి కలగాలన్నారు. ర్యాలీ ఎన్జీ కళాశాల నుంచి పట్టణంలోని పలు ప్రాంతాల మీదుగా సాగి గడియారం సెంటర్‌కు చేరుకుంది. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, డీఎస్పీ శివరాంరెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రాఘవులు, రాజశేఖర్ రెడ్డి, మహాలక్ష్మయ్య, శ్రీను నాయక్, ఆర్ఐలు సంతోష్, శ్రీను, సూరప్ప నాయుడు, హరిబాబు, ఎస్ఐలు సైదులు, శంకర్, గోపాలరావు, వీరబాబు, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

చిట్యాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ కోరారు. గురువారం చిట్యాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. మందుల స్టాక్, రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్ రెడ్డి, డీటీసీ కళ్యాణచక్రవర్తి, డీఎంవో ప్రదీప్‌కుమార్, వైద్యాధికారి సత్యనరేష్, సిబ్బంది వెంకటరమణమ్మ, కమలకుమారి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తే చర్యలు

జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు

దేవరకొండ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న సన్నబియ్యాన్ని పక్కదారి పట్టిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి వెంకటేశ్వర్లు గురువారం హెచ్చరించారు. జిల్లాలో అన్ని రేషన్ దుకాణాలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా పంపిణీ కోసం ఉద్దేశించిన బియ్యాన్ని అక్రమంగా మళ్లించకుండా నిరోధించడానికి చర్యలు చేపడుతున్నామన్నారు.

తేమతో నిమిత్తం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

నార్కట్‌పల్లి,అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్‌తో తడిసిన ధాన్యాన్ని తేమతో నిమిత్తం లేకుండా కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి డిమాండ్‌చేశారు. గురువారం నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెం ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తమ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. కేంద్రంలో తడిసిన ధాన్యం కుప్పలను పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చి 20రోజులు గడుస్తున్నా కాంటా వేయకపోవడం కారణంగానే ధాన్యం ఎక్కువగా తడిసిందన్నారు. ప్రభుత్వం తక్షణమే రైతుల ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10,000 పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి చింతపల్లి బయ్యన్న, తుమ్మల పద్మ, చెర్కు పెద్దులు, దండు రవి, బొల్లెద్దు సైదులు, దండు నాగరాజు, అంతటి సత్యనారాయణ, మాదగోని సైదులు, దండు శంకరయ్య పాల్గొన్నారు.

ఇలా వెళ్లి.. అలా వచ్చారు

- ఉదయం బదిలీ... మధ్యాహ్నం డిప్యూటేషన్
- ఆ సార్‌కు గంటల్లోనే తిరిగి యథాతథ పోస్ట్
- రిజిస్ట్రేషన్ శాఖలో అక్రమ బదిలీల దందా



జిల్లా స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖలో జరిగిన ఈ అక్రమ బదిలీ బాగోతం సర్వత్రా చర్చకు దారితీసింది. ఓ చిన్నసార్‌కు రెగ్యులరైజేషన్ ఇవ్వడమే కాకుండా జిల్లాలోని ఓ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఉదయం బదిలీచేసి మధ్యాహ్నం డిప్యుటేషన్‌పై తీసుకరావడం చర్చనీయాంశమైంది.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

ఉమ్మడి నల్లగొండ జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఓ చిరుద్యోగి ఇష్టారాజ్యంగా వ్యవహరించి వసూళ్లను నిరంతర ప్రక్రియగా మార్చేశారన్న ఆరోపణలున్నాయి. సాధారణంగా జరిగే సెక్షన్ టూ సెక్షన్‌కు వెళ్లే ఫైళ్లకు సైతం రేట్లు నిర్ణయించాడు. ఆ సొమ్ము అంతా తనకు చెల్లించిన తర్వాతే ఫైల్ ఉన్నతాధికారి వద్దకు వెళ్లే విధంగా శాఖలో పట్టు సాధించాడు. సక్రమంగా ఉన్న ఫైళ్లకు ఒక్కో ఫైల్‌కు సంబంధించి కేటగిరీగా డబ్బులు వసూలు చేస్తున్న ఆ ఉద్యోగి కిరికిరి ఉన్న సొసైటీ ఫైళ్లకు రూ.లక్షల్లో వసూలు చేస్తున్నాడు. ఇన్‌చార్జి అధికారులు ఉన్న సమయంతోపాటు పూర్తిస్థాయి అధికారులు సెలవుల్లో వెళ్లిన సమయంలో అక్రమ వసూళ్లు చేయడం పరిపాటిగా మారింది. ఈ తతంగం అంతా రోజురోజుకు మితిమీరి పోతుండటంతో సంబంధిత శాఖలోని సీనియర్ ఉద్యోగులకు పాలుపోవడం లేదు. దీంతో చేసేది ఏమీ లేక వారు కూడా తమకు అప్పగించిన పని చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

డబ్బులు ఇవ్వకపోతే ఇక అంతే సంగతి..

స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖలో డబ్బులు ఇవ్వని ప్రతీ ఫైల్‌ను ఆ చిన్న సార్ వెనక్కి పంపుతున్నాడన్న ఆరోపణలు వస్తున్నాయి. సాధారణంగా ఆస్తుల క్రయ విక్రయాలతోపాటు డాక్యుమెంట్ రైటర్లు, ఇతరులు తమ డాక్యుమెంట్లు, ఫైళ్లను ఆ సెక్షన్‌కు పంపితే ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అన్ని కాగితాలు సక్రమంగా ఉన్నప్పటికీ ఫైల్ రిజెక్టు చేయడం, రోజుల కొద్దీ పెండింగ్‌లో పెట్టడం గమనార్హం. సొసైటీల ఫైల్‌తోపాటు పర్మ్‌లు, బైలాలు, ఎంఈలు, వ్యాలిడేషన్, అమైన్‌మెంట్, స్టాంపు లైసెన్స్‌లు, ఫ్రాంకింగ్‌కు సంబంధించిన ప్రతీ అంశంలోనూ ఆ సార్ చేయిపెడుతుండడం గమనార్హం. ఇతర సెక్షన్ ఉద్యోగులకు ఏ మాత్రం కూడా స్వేచ్ఛ లేకుండా అన్నీ తానై నడుపుతుండటంతో సెక్షన్ల పనితీరు పూర్తిగా గాడి తప్పిపోయింది. సెక్షన్ల సర్దుబాటు చేశామని పేర్కొంటున్నా, సీనియర్లకు ప్రాధాన్యం లేకపోవడం వల్ల అడ్మినిస్ట్రేషన్ ఆగమాగంగా మారింది.

చిట్‌ఫండ్‌ల ఫైల్‌ల విషయంలో..

జిల్లాలోని పలు చిట్‌ఫండ్‌లకు సంబంధించిన సమస్యలు వచ్చినప్పుడు ఆ ఉద్యోగికి కాసుల పంట పండుతుంది. కొన్ని చిట్‌ఫండ్‌లో డీఫాల్టర్లు.. అంటే ఎవరైనా చిట్టి ఎత్తి డబ్బులు కట్టకపోతే వారికి..

- మిగతా 8వ పేజీలో...

ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం

ఫిర్యాదులువస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. సెక్షన్ల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీనియర్లకు ప్రాధాన్యం కల్పిస్తాం. ఫైళ్ల విషయంలో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. సదరు ఉద్యోగి బదిలీ జరిగిన వెంటనే డిప్యుటేషన్‌పై వచ్చిన విషయాన్ని పరిశీలిస్తాం. స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలో పారదర్శకంగా సేవలు అందిస్తాం.

- రవీందర్ రావు, ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్, నల్లగొండ

ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



తిప్పర్తి ధాన్యం కొనుగోలు కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్, ఎస్పీ

మాడ్గులపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షానికి ధాన్యం తడవకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలను ఆదేశించారు. గురువారం ఎస్పీ శరత్‌చంద్రపవార్‌తో కలిసి మండలంలోని చిరుమర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీచేసి మాట్లాడారు. మొంథా తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఐకేపీ కేంద్రంలోని ధాన్యం తడిసి రంగు మారిపోగా, ధాన్యం కొనుగోలు విషయంలో చిరుమర్తి కొనుగోలు కేంద్రానికి అనుసంధానం చేసిన రైస్‌మిల్లుతో సమన్వయం చేసుకొని ధాన్యం దించుకునేలా చూడాలని డీఆర్‌డీవో శేఖర్ రెడ్డికి సూచించారు. టార్పాలిన్లు, లారీల సమస్య లేకుండా ముందే చూసుకోవాలని, నాణ్యత ప్రమాణాలతో వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలన్నారు. వారి వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఎస్‌వో వెంకటేష్, పౌరసరఫరాల డీఎం గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

తిప్పర్తి: ధాన్యం కొనుగోలు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. తిప్పర్తి మండలకేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత ధాన్యంపై కప్పడానికి కనీసం టార్పాలిన్ కవర్లు కూడా సెంటర్ నిర్వాహకులు ఇవ్వడం లేదని పలువురు రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సెంటర్ నిర్వాహకులు సరైన నిర్వహణ చేయడం లేదని తెలియజేయడంతో ఆగ్రహించిన కలెక్టర్ నిర్వాహకుడికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఆమెవెంట అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, నల్లగొండ ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, డీఎస్‌వో వెంకటేష్, గోపికృష్ణ, మార్కెటింగ్ ఏడీ చాయాదేవి, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, నల్లగొండ మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్ పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు జలకళ

- సాగర్ 14 గేట్ల నుంచి నీటి విడుదల
- 590 అడుగుల వద్ద నీటిమట్టం
- నిండుకుండలా శాలిగౌరారం ప్రాజెక్టు
- మూసీకి పోటెత్తిన వరద
- నీటమునిగిన అంభభవాని పంప్‌హౌస్



అలుగుపోస్తున్న డిండి ప్రాజెక్టు

7

ఓటర్ల జాబితా సవరణకు సర్

- అత్యంత సమర్థంగా సర్ నిర్వహణ
- ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సర్వేకు ఏర్పాట్లు

6

శిశు విక్రయాలకు పాల్పడితే కేసులు

జిల్లా సంక్షేమ అధికారి కె.కృష్ణవేణి

తిరుమలగిరి(సాగర్), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఎవరైనా శిశు విక్రయాలు, భ్రూణ హత్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని జిల్లా సంక్షేమ అధికారి కె.కృష్ణవేణి హెచ్చరించారు. గురవారం మండలకేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. మహిళలు గర్భం దాల్చిన మూడో నెలలోనే అంగన్‌వాడీ కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. ముందు ఆడపిల్లలు ఉండి, మళ్లీ కాన్పులో ఆడ పిల్ల పుడితే వారిని సాకలేని పరిస్థితి ఉంటే ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందిస్తే, వారిని శిశు గృహాలకు అప్పగిస్తామన్నారు. బాల్య వివాహాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీవో సువర్ణ, సూపర్‌వైజర్ యాదమ్మ, మహేష్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి

● ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సైదానాయక్



తరగతులను బహిష్కరించిన నాయకులు

మిర్యాలగూడ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుర్ర సైదానాయక్ కోరారు. గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీ మేరకు ఆరేళ్లుగా బకాయిపడిన రూ.8,150 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రైవేట్ కళాశాలల్లో ఫీజు బకాయిలు ఉండడంతో విద్యార్థులకు సర్టిఫికేట్లు ఇవ్వడం లేదన్నారు. బకాయి నిధుల విడుదల కోసం కళాశాల యాజమాన్యాలు బంద్‌కు పిలుపునిస్తే వారితో చర్చలు జరిపి రూ.1200 కోట్లు విడుదల చేస్తామని ప్రకటించి, మాట తప్పడంతో తిరిగి కళాశాలల మూసివేతకు యాజమాన్యాలు సమాయత్తమవుతున్నాయన్నారు. దీంతో పేద విద్యార్థుల భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముతున్నాయన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి బకాయిల విడుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి ప్రత్యక్ష పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జగన్‌నాయక్, వదూద్, న్యూమాన్, వీరన్న, కోటేష్, అనిల్, బన్నీ హనుమంతు, ఎస్ఎఫ్ఐ నల్లగొండ జిల్లా బాలికల కన్వీనర్ ప్రసన్న, నవ్య, కావ్య, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

'యాదవులకు మంత్రి పదవి ఇవ్వాలి'

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మంత్రివర్గ విస్తరణలో యాదవులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని సంఘం ప్రధాన కార్యదర్శి చేగొండి మురళీయాదవ్ కోరారు. గురువారం డాక్టర్స్ కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ జనాభాలో అధికశాతం ఉన్న యాదవులకు చట్టసభల్లో ప్రాధాన్యత లేదన్నారు. యాదవుల అభివృద్ధిని కాంక్షిస్తూ యాదవులకు మంత్రి పదవి, కార్పొరేషన్ పదవులు ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరారు.

మండలంలో 40 ఎకరాల్లో పంట నష్టం

గుర్రంపోడు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో తుఫాన్ వల్ల 40 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని అంచనా వేసి నివేదికలు పంపించినట్లు ఏవో మండల వ్యవసాయ అధికారి కంచర్ల మాధవరెడ్డి గురువారం తెలిపారు. కుంటలు, చెరువులు అలుగులు పోయడంతో వాటి కింద సాగుచేసిన వరిపొలాలు దెబ్బతిన్నాయని తెలిపారు. తానేదార్‌పల్లితో నీట మునిగిన వరి పొలాలను పరిశీలించారు. మండలంలో 10ఎకరాల్లో పంట నీట మునగగా, మరో 30ఎకరాలు నేలకొరిగి దెబ్బతిన్నట్లు తెలిపారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


గూడూరు గ్రామంలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న రంగారెడ్డి

మిర్యాలగూడ రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గూడూరు గ్రామంలో తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు నేలకొరిగిన వరి పొలాలను ఆయన పరిశీలించి రైతులను పరామర్శించి మాట్లాడారు. సుమారు రూ.30 నుంచి రూ.40వేల వరకు పెట్టుబడులు పెట్టి ఆరుగాలం కష్టించి పండించిన పంట తీరా చేతికొచ్చే సమంలో మొంథా తుఫాన్ ప్రభావంతో నేలకొరిగాయని, దీంతో రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సంబంధిత వ్యవసాయాధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే చేయించి ఎకరాకు రూ.30వేల వరకు నష్ట పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా కొనుగో లు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం అకాల వర్షాలకు తడిసి ముద్దయి మొలకలు వచ్చాయని, తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి రవినాయక్, నాయకులు పిలుట్ల సైదులు, రవీందర్‌నాయక్, సత్యనారాయణ, శ్రీను, మోతిలాల్, రవి, మానేందర్, శేఖర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: రైతులకు ప్రభుత్వపరంగా తగిన పరిహారం అందించి ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం నేలవాలిన పంట పొలాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యు డు దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్, నాయకు లు జూకూరు నాగయ్య, పతాని శ్రీను, నాయకులు నారాయణరెడ్డి, నాగయ్య, సీతారాంరెడ్డి, రైతులు గోవర్ధన్‌రెడ్డి, జహంగీర్ పాల్గొన్నారు.

ఎకరానికి రూ.40 వేలు నష్టపరిహారాన్ని ఇవ్వాలి: బీజేపీ

వేములపల్లి: అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.40వేల నష్ట పరిహారాన్ని అందించి ఆదుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జవ్వాజి సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు పెదమాం భరత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని శెట్టిపాలెం గ్రామ శివారులో నేలవాలిన పంట పొలాలను వారు పరిశీలించి మాట్లాడారు. కేంద్రప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు చిర్ర సాంబమూర్తి, చలమల్ల సీతారాంరెడ్డి, పెదమాం వెంకన్న, ప్రసాద్, ఉపేందర్, రాంరెడ్డి, ప్రభాకర్, సోమయ్య, అనిల్, సతీష్, అంజయ్య, లింగయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

దామరచర్ల: పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని బీజేపీ దామరచర్ల మండల అధ్యక్షుడు ధీరావత్ మేషనాయక్ డిమాండ్ చేశారు. మండలంలో దెబ్బతిన్న వరి పంటను ఆయన పరిశీలించారు. కౌలు రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

మిర్యాలగూడ రూరల్: పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు కోరారు. మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లి, కాల్వపల్లి గ్రామాల్లో నేలవాలిన పంట పొలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. వర్షానికి పత్తికాయ పగిలి బూజు పడుతుందని, పత్తి రైతులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు వంగాల మహేష్‌కుమార్, రవినాయక్, భీమ్లానాయక్, సప్లి పాల్గొన్నారు.

రైతులను నష్టపరిహారం ఇవ్వాలి : టీడీపీ

మిర్యాలగూడ టౌన్: పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు చిలకల వెంకన్నయాదవ్ డిమాండ్ చేశారు. పట్టణ శివారులోని పంట పొలాలను రైతులతో కలిసి గురువారం పరిశీలించారు. పంట చేతికొచ్చే తరుణంలో కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా చేతికందాల్సిన పంట నేలకొరిగిందన్నారు. ప్రభుత్వం వెంటనే పంట నష్టాన్ని అంచనా వేయించి అన్నదాతలను ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నూకపంగు కాశయ్య, లింగానాయక్, కాంతాచారి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

మిర్యాలగూడ రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా మండలంలో దెబ్బతిన్న వరి పంట పొలాలను వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గురువారం మండల పరిధిలోని తుంగపాడు, వెంకటాద్రిపాలెం, గోగువారిగూడెం గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో తుఫాన్ కారణంగా నేలకొరిగిన వరి పొలాలను ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్ క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించి మాట్లాడారు. మిర్యాలగూడ మండలంలో మొత్తం 42,500 ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేయగా అందులో సుమారు 6,720ఎకరాల్లో వర్షాల కారణంగా నేలవాలినట్లు నిర్ధారించామన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు షఫి, రమేష్, కృష్ణ, గోపి, రైతులు లింగయ్య, రవీందర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చందంపేట: చందంపేట మండలంలోని ముడుదండ్ల, పోల్యానాయక్‌తండా, హంక్యతండా, చందంపేట ప్రాంతాల్లో వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను ఏవో లక్‌పతినాయక్ పరిశీలించారు. ఆయన వెంట ఏఈవో ప్రవీన్, వ్యవసాయ అధికారులు ఉన్నారు.

డిండి: మండలంలో సుమారు 400 ఎకరాల్లో వరి, 600 ఎకరాల పత్తి పంటకు నష్టం జరిగినట్లు ఏవో రెహనా అంచనా వేశారు.

కొండమల్లేపల్లి: మండల పరిధిలోని చింతకుంట్ల గ్రామంలోని నల్లకుంట కట్ట బుధవారం ఉదయం తెగిపోవడంతో కొర్రోనితండాకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో రైతులు వరి పంటలు మొత్తం నీట మునిగాయి. అందులో భాగంగా గురువారం కొండమల్లేపల్లి ఏవో వై.జానకిరాములు, ఏఈవో సురేష్‌తో కలిసి పలు గ్రామాల్లో నీట మునిగి వరి పంటలను పరిశీలించారు. చింతకుంట్ల నల్లకుంట కట్ట తెగిపోవడంతో సుమారు వెయ్యి ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని అన్నారు. అనంతరం తెగిపోయిన నల్లకుంట కట్టను పరిశీలించారు. ఆయన వెంట ఏఈవోలు సురేష్, మాధురి, రైతులు గుండాల కాశయ్య, అంగోతు సుక్య, శ్రీరాములు, నగేష్, యాదయ్య ఉన్నారు.

రాకపోకలకు ఇబ్బందులు

చింతపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని కుర్మేడ్ నుంచి సాయిరెడ్డిగూడెం, ఎం.మల్లేపల్లికి వెళ్లే దారిలో రెండు లోలెవల్ బ్రిడ్జిలు ఏర్పాటు చేశారు. ఇటీవల కురిసిన వర్షానికి వరద చేరడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ప్రధానంగా సాయిరెడ్డిగూడెం, ఎం.మల్లేపల్లి, పి.కే.మల్లేపల్లి, కిష్టారాయినిపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు తమ పనుల కోసం కుర్మేడ్‌కు రావాల్సి ఉంది. వాగులో వరదనీరు చేరడంతో ద్విచక్రవాహనదారులకు తీవ్రఅంతరాయం కలిగింది. అధికారులు స్పందించి హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇలా వెళ్లి.. అలా వచ్చారు

(5వపేజీ తరువాయి)

సంబంధించి డబ్బుల కలెక్షన్ మితిమీరిపోతుంది. చిట్టి ఎత్తిన వారికి సంబంధించిన ప్రతీ ఫైల్‌ను ఆ చిట్‌ఫండ్ యజమానులు పూర్తిగా తయారు చేసుకొని వచ్చి అధికారుల దగ్గరకు వచ్చే సరికి రూ.1000 నుంచి రూ.3వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇక చిట్‌ఫండ్‌లలో గొడవలకు సంబంధించి ఉంటే ముడుపులు భారీగా ఉంటున్నట్లు సమాచారం. సాధారణ సొసైటీల ఫైల్‌లకు సంబంధించి రూ.1500 నుంచి రూ.2500, ఫ్రాంకింగ్ మిషన్‌లకు సంబంధించి రూ.2వేల వరకు వసూలు చేస్తుండగా, రెన్యూవల్‌కు వచ్చే సరికి భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం.

నేలరాలిన ఆశలు


చింతపల్లి లో నేలవాలిన పంట చేలను రైతులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

- ఆయకట్టు అతలాకుతలం
- 30 వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం
- తడిసిన ధాన్యం రాశులు
- లబోదిబోమంటున్న రైతులు

మిర్యాలగూడ, మిర్యాలగూడఅర్బన్, నిడమనూరు, దేవరకొండ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ రైతులను కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. రైతుల ఆశలు నేలరాలాయి. పది రోజుల్లో పంట చేతికి వస్తుందనగా అకస్మాత్తుగా గాలివానతో విరుచుకపడిన మొంథా తుఫాన్ రైతుల కష్టాన్ని నీటిపాలు చేసింది. వాయుగుండం బలహీనపడి తీరాన్ని తాకే సమయంలో వర్షంతో పాటు బలమైన గాలులు వీయడంతో వరి చేలు నేలకు వాలిపోయాయి. పడిపోయిన వరి పైనుంచి వరద నీరు ప్రవహించి వరికంకులు బురదలో కొట్టుకుపోయాయి. మూడు రోజులు పాటు నీటిలో నానిన వడ్లు రంగు మారి పనికిరాకుండా పోతున్నాయిని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షంతో పాటు గాలులు వీయడంతో వడ్ల కంకి బరువుకు వరి కర్రలు నేలకరుచకపోవడంతో సగానికి పైగా దిగుబడి తగ్గి రైతులకు తుఫాను వెతలు మిగిల్చిందని వాపోతున్నారు. డివిజన్ పరిధిలో సాగర్ ఆయకట్టుకింద 1,44,500 ఎకరాల విస్తీర్ణంలో పంటల సాగు జరగ్గా, వరి 1,16,500, పత్తి 20,280 ఎకరాల్లో సాగు చేశారు. 7,470 ఎకరాల్లో ఉద్యాన, వాణిజ్య, కూరగాయల పంటలు వేశారు. డివిజన్ పరిధిలో ప్రధానంగా సాగైన వరి పంటలో సుమారు 55వేల ఎకరాల్లో వరిపంట కోతదశకు చేరగా, మిగతా 61,750 ఎకరాల్లోని వరిపైర్లు పాలకంకిదశలో ఉన్నాయి. ఈ దశలోకి చేరిన పంట పైర్లు సైతం వరుసగా కురిసిన వర్షాలకు వచ్చి చేరుతున్న వరదనీట మునిగి పాచిపోతున్నాయి. దీంతో బాధిత రైతులు దిక్కుతోచని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

లోతట్టు ప్రాంతాల్లో దెబ్బతిన్న పంటలు

వర్షాల కారణంగా చెరువులు నిండి అలుగుపోస్తుండటంతో లోతట్టు ప్రాంతాలలోని వరి చేలపై వరద ముంచెత్తి పంటలు నీట మునిగాయి. మిర్యాలగూడ మండలం ఐలాపురం కుంటకింది తండాలో సుమారు 80ఎకరాల్లో పంట నీటి పాలైందని గ్రామస్థులు కంట నీరు పెడుతున్నారు. తుంగపాడు, వెంకటాద్రిపాలెం, గోగువారిగూడెం గ్రామాల్లో వర్షాలు వరదల కారణంగా పంట చేలు నేలకరుచుక పోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

30వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం

మిర్యాలగూడ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లో సుమారు 30వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. కొన్ని చోట్ల ఎకరాలకు ఎకరాలు పూర్తిగా పడిపోగా మరికొన్ని ప్రాంతాల్లో పాక్షికంగా పంట చేలు నేలకొరిగాయి. సాగర్ నియోజక వర్గంలో 1,29,000 ఎకరాల్లో పంటలు సాగుచేయగా అకాలవర్షాల కారణంగా 14వేల ఎకరాల్లో వరి, 2,800 ఎకరాల్లో పత్తి చేలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు తెలిసింది. మిర్యాలగూడ నియోజకవర్గంలో 1.16 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేయగా 11,279 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. 8,162 మంది రైతులకు పంట నష్టం జరిగినట్లు తెలుస్తోంది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తే నష్టపోయిన రైతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

మళ్లీ ముంచిన 'అక్టోబరు'

కూలీల కొరతను అధిగమించేందుకు కొన్ని ప్రాంతాల రైతులు జూలై మొదటి వారంలో వరి నాట్లు షురూ చేయగా, అక్టోబరు మాసాంతంలో కోత దశకు చేరుకుంది. ఈ మాసంలోనే తుఫాన్ల ప్రభావం అధికంగా ఉంటుంది. పదేళ్ల తర్వాత మళ్లీ ఇంతటి నష్టాన్ని చూస్తున్నామంటూ రైతులు చెబుతున్నారు. 2014లో హుదూద్ తుఫాన్ మిగిల్చిన నష్టం మళ్లీ పునావృతమైంది. ఈ దఫా ఏప్రిల్ - జూలై వరకు ఎండల తీవ్రత కనిపించింది. వానాకాలం సీజన్ మొదలైనప్పటికి ఇలాంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏడేళ్లకు ఓ సారి కనిపిస్తాయని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. అక్టోబరు నెలలో జరిగే వాతావరణ మార్పుల కారణంగా తుఫాన్ల ప్రభావం ఏర్పడి ప్రతికూల వాతావరణ పరిస్థితులతో అపార నష్టం కలుగుతోంది. 2014లోనూ అక్టోబరు మాసంలోనే హుదూద్ తుఫాన్ ఏర్పడగా, ప్రస్తుతం మొంథా తుఫాన్ దాడి రైతులు గతాన్ని నెమరేసుకుంటూ హైరానా పడుతున్నారు.

దేవరకొండ డివిజన్‌లోనూ పంట నష్టం

దేవరకొండ డివిజన్‌లో భారీగా పంట నష్టం వాటిల్లింది. డివిజన్‌లో రైతులు 1.70 లక్షల ఎకరాల్లో పత్తి, 55 వేల ఎకరాల్లో వరి పంటలు సాగు చేశారు. పత్తి పంట చేతికొచ్చే సమయానికి వర్షాలతో తీవ్ర నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని చెబుతున్నారు. దేవరకొండ వ్యవసాయ డివిజన్‌లో నాలుగు వేల ఎకరాల వరకు వరి పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. అన్ని మండలాల్లో వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలిస్తున్నారని దేవరకొండ ఏడీఏ శ్రీలక్ష్మీ తెలిపారు.


ముప్పారంలో నేలవాలిన వరి పొలం

కౌలు రైతులు కుదేలు

జిల్లాలో కౌలు రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా తయారైంది. జిల్లా వ్యాప్తంగా సుమారు 6,57,229 ఎకరాల్లో వివిధ పంటల సాగు జరుగుతోంది. అందులో 1,97,638 ఎకరాల్లో పత్తి, ఇతర పంటలు సాగు చేయగా 4,59,591 ఎకరాల్లో వరి సాగైంది. అందులో 45 శాతం మంది రైతులు 2,93,632 ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నారు. ప్రస్తుత వరి సాగుచేసిన విస్తీర్ణంలో 45 శాతం భూమిని కౌలు రైతులు సాగు చేస్తున్నారు. ఆయా భూములను కౌలుకు తీసుకునేందుకు కొన్ని చోట్ల కౌలు రైతులు ముందస్తు చెల్లింపుల కోసం అప్పులు చేశారు. తుఫాన్ ప్రభావంతో చేతికందవచ్చిన వరి, పత్తి పంట పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో పంటసాగు పెట్టుబడి, ముందస్తు కౌలు చెల్లింపులు చెసిన అప్పులకు వడ్డీలు కట్టడం ఎలా..? పిల్లల చదువు ఖర్చులు, కుటుంబ పోషణ భారాన్ని నెట్టుకొచ్చేదెలా అంటూ కౌలు రైతు కుటుంబం మదనపడుతోంది.

కూలి డబ్బులు వచ్చే అవకాశం లేదు



రెండు ఎకరాలు సన్నాలు సాగు చేశా. ఎకరానికి రూ.30-35 వేల వరకు పెట్టుబడి పెట్టా. మొదటి వర్షాలకే కొంచెం చేను ఒరిగింది. కూలీలతో బుట్టలు కట్టించా. రెండు రోజులుగా కురిసిన తుఫానుతో ఐలాపురం చెరువు అలుగుపోసి వరద పారడంతో వరి చేను మొత్తం నీటిపాలైంది. వరి చేను కోస్తే కోత మిషన్ కిరాయి డబ్బులు వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

\- తేజావత్ కిషన్, రైతు, కుంటకిందితండా

మూడెకరాల పొలం నేలవాలింది



అప్పులు చేసి వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి ఈ సీజన్‌లో మూడు ఎకరాల పొలం సాగు చేశాను. కానీ తుఫాన్ కారణంగా భారీగా వర్షాలు కురుస్తున్నందున పొలం మొత్తం నేలకొరిగింది. పొలమంతా నేలవాలడంతో దిగుబడి తగ్గి నష్టం వస్తుంది. కనీసం పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం లేదు. పంట నష్టాన్ని అంచనా వేసి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

\- బత్తిని నరేష్, ఊట్కూరు, నిడమనూరు

క్షేత్రస్థాయిలో నష్ట వివరాలు సేకరిస్తున్నాం



తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాల కారణంగా నష్టపోయిన పంటల వివరాలను తెలుసుకునేందుకు సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నాం. రైతులను కలిసి పంటల వివరాలు సేకరిస్తాం. ప్రస్తుతం వరి, పత్తి పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేశాం. దిగుబడి ఏ మేరకు తగ్గుతుందనే విషయమై నిపుణులతో చర్చించి పంటల వారీగా నష్టం వివరాలపై నివేదిక రూపొందిస్తాం. రైతులు మడిలో నీరు నిల్వ ఉండకుండా తీసివేయాలి. వర్షం తగ్గాక కిందపడిన వరిని రెండు మూడు గంటలు కలిపి కట్టలు కట్టడం వల్ల వరి ధాన్యం రంగుమారకుండా ఉంటుంది. కోసిన ధాన్యం మొలకెత్తకుండా ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని కలిపి పిచికారీ చేయాలి.

\- సరిత, ఏడీఏ, హాలియా

అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి

- ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్


మల్లేపల్లి: గౌరికుంటతండాకు వెళ్లే వర్షపు నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, చందంపేట, చింతపల్లి, కొండమల్లేపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ నియోజకవర్గంలో మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షానికి ప్రజలు ముంపునకు గురయ్యారని, వ్యవసాయ పంటలు, రహదారులు ధ్వంసమై నష్టం జరిగిందని, అధికారులు అప్రమత్తంగా ఉండి తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ కోరారు. దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో గురువారం అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలతో కలిగిన నష్టాలపై సమగ్ర వివరాలను అడిగి తెలుసుకొని త్వరితగతిన పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు అవసరమైన ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు అందేలా చూడాలన్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోకుండా విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో రమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యమునమాధవరెడ్డి, మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

చందంపేట: మండలంలోని కొరుట్ల సమీపంలో దెబ్బతిన్న తెల్దేవరపల్లి, కంభాలపల్లి, దేవరచర్ల గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిని ఎమ్మెల్యే బాలునాయక్ పరిశీలించారు. తక్షణమే తాత్కాలిక ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేసి శాశ్వతమైన రహదారిని నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ శ్రీధర్‌బాబు, ఎంపీడీవో శ్రీలక్ష్మి, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్ అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో దెబ్బతిన్న రోడ్లను ఎమ్మెల్యే బాలునాయక్ సందర్శించారు. ఇటీవల కురిసిన వర్షానికి ఉప్పరపల్లి గ్రామంలో బ్రిడ్జి దెబ్బతినడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని అన్నారు. భవిష్యత్తులో రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రూ.6కోట్లతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, ఎంపీడీవో సుజాత, తహసీల్దార్ రమాకాంత్‌శర్మ, మాజీ ఎంపీటీసీ కొండల్ యాదవ్, స్వాతి, యాదయ్య, శ్రీశైలం, రవీందర్‌రావు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులు, ప్రజలు అధైర్యపడవద్దని ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. మండలకేంద్రంలోని నల్లగొండ రోడ్డులోని నల్లకుంట కింది భాగంలో నీటమునిగిన కాలనీలు, గౌరికుంటతండాను ఆయన పరిశీలించారు. నల్లకుంటలోకి వర్షపు నీరు వెళ్లడానికి పెద్ద గూనలు వేయాలని అధికారులకు సూచించారు. పలు ప్రత్యామ్నాయ చర్యల గురించి వివరించారు. ఆయన వెంట ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో స్వర్ణలత, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్‌రెడ్డి, నాయిని మాధవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ శైలజ, రమావత్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను కారణంగా జరిగిన నష్టాన్ని నివారించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ ధాటికి దెబ్బతిన్న రోడ్లను గుర్తించి తక్షణమే గుంతలు పూడ్చివేయాలని, రైతుల ధాన్యం రవాణాకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం సర్వే చేసి నివేదికలు అందజేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగు జాగ్రత్తలు వహించాలని కోరారు. రైతులు అకాల వర్షాల బారిన పడి ఆర్థికంగా కుంగిపోకుండా పెద్ద మనసుతో మిల్లర్లు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. అన్ని శాఖల అధికారులు ఒక వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసుకొని గుర్తించిన సమస్యలు, చేపట్టిన చర్యలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్, ఎంఈవో బాలునాయక్, తహసీల్దార్ సురేష్, మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మొంథా.. నష్టం కొండంత

(5వపేజీ తరువాయి)

వరి, 1350 ఎకరాల్లో పత్తి దెబ్బతినగా, నకిరేకల్ నియోజకవర్గంలోని 37 గ్రామాల్లో 4,410 ఎకరాల్లో వరి, 2,721 ఎకరాల్లో పత్తి దెబ్బతినగా నల్లగొండ నియోజకవర్గంలో 19 గ్రామాల్లో 1,239 ఎకరాల్లో వరి, 139 ఎకరాల్లో పత్తి పంటకు నష్టం జరిగింది. ఈమేరకు వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కలెక్టర్ ఇలాత్రిపాఠికి నివేదిక అందజేయగా కలెక్టర్ ప్రభుత్వానికి నివేదికను పంపించారు.

ప్రాథమిక అంచనా పూర్తి చేశాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వర్షాలతో నష్టపోయిన పంటలకు సంబంధించి ప్రాథమిక అంచనాను పూర్తి చేశాం. నివేదికను కలెక్టర్‌కు అందజేశాం. కలెక్టర్ ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తారు. క్షేత్ర స్థాయిలో పంట నష్టం అంచనాను వ్యవసాయ అధికార యంత్రాంగం త్వరగా పూర్తి చేయడంతో పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికను రూపొందించాం.

\- పి.శ్రవణ్ కుమార్, జేడీఏ నల్లగొండ

జిల్లాలో నియోజకవర్గాల వారీగా పంట నష్టం వివరాలు...

నియోజకవర్గం	వరి	పత్తి	మిర్చి	మొత్తం
నాగార్జునసాగర్	14004	2814	30	16848
దేవరకొండ	4665	18830	25	23520
మిర్యాలగూడ	10244	65	50	10359
మునుగోడు	925	1350	---	2275
నకిరేకల్	4410	2721	----	7131
నల్లగొండ	1239	139	----	1378
మొత్తం	35487	25919	105	61511

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

వేములపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురిసే సమయంలో ఎలాంటి విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ ఏడీఈ రవీందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో గురువారం విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈ నాగరాజు, లైన్‌మెన్ వెంకటేశ్వర్లు, సిబ్బంది లచ్చయ్య, సైదిరెడ్డి పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి



దేవరకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హాలియా, దేవరకొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెం ట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కోరే రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు బుడిగె వెంకటేష్ డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం దేవరకొండ, హాలియాలో ఇంటర్, డిగ్రీ కళాశాలలను బంద్ చేయించారు. దేవరకొండలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ఇవ్వకుండా పేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తుందన్నారు. ప్రభు త్వం పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని సూచించారు. లేనిచో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎస్ఎఫ్ఐ నాయకులు వర్షిత్, శివ, అరవింద్, నాగరాజు, ప్రవీణ్, అరుణ్, చంటి, నాయకులు గణేష్, రామలింగం, మల్లేష్, సింహాద్రి, వరుణ్‌తేజ, మహేష్ పాల్గొన్నారు.